## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

**పెరుమాళ్ళ వర ప్రసాద్**

సంప్రదించవలసిన నంబర్లు

**94916 28386 85220 22029**

**Land Line No : 08517 224194**



RNI Rgd NO : 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక



తెలంగాణ - శ్రీ ప్రస్థానం



Call : 8522022029, 9491628386



కర్నూలు సంపుటి : 04 సంచిక : 15 ఆదివారం 28-04-2024 పేజీలు :04 వెల:రూ.2.00


## దశలవారీగా కాంగ్రెస్‌పై బీజేపీ యుద్ధం..

### ఒక్కో విడతలో ఒక్కో అస్త్రం ప్రయోగం



లక్నో : దేశంలో 7 దశల వారీగా లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరుగుతోంది. మూడోసారి అధికారమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ ప్రచారంలో దూసుకుపోతోంది. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే బీజేపీ దశలవారీగా కాంగ్రెస్‌పై ఎన్నికల యుద్ధం చేస్తోంది. ఒక్కో ఫేజులో ఒక్కో అస్త్రంతో కాంగ్రెస్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. తొలి, మలి విడత ప్రచారంలో బీజేపీ ప్రయోగించిన అస్త్రాలేంటి? ఇక మూడో ఫేజులో మాత్రం..వీడియో పే రచ్చతో కాంగ్రెస్ వ్యూహాలు ఎగరగొట్టేస్తామంటోంది. తొలి విడత ప్రచారంలో కాంగ్రెస్‌పై రామ బాణం ప్రయోగించింది భారతీయ జనతా పార్టీ. 500 ఏళ్ల హిందువుల కలను తామే నెరవేర్చామంది బీజేపీ. అయోధ్యలో రామ మందిర నిర్మాణం కల సాకారం చేశామంటూ కాంగ్రెస్‌ను ఉక్కిరిబిక్కిరి చేసింది కాషాయ పార్టీ. ఇక రెండో దశ ప్రచారంలో, సంపద పన్ను పేరుతో ప్రజల సొమ్మును కాంగ్రెస్ లాక్కుంటుంది అనే ఆరోపణలతో ప్రచార భేరి మోగించింది బీజేపీ. అమెరికాలో లాగానే భారత్‌లో కూడా వారసత్వ పన్ను వేస్తే బాగుంటుందని, కాంగ్రెస్ ఎన్ఆర్ఐ సెల్ అధ్యక్షుడు శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు బీజేపీకి ఆయుధంగా మారాయి. వారసత్వ పన్ను పేరుతో దేశ ప్రజల సంపదను కాంగ్రెస్ లాక్కునే ప్రయత్నం చేస్తోందంటూ రెండో విడత ప్రచారంలో మోదీ ఆరోపించారు. ముస్లిం లీగ్ నుంచి ప్రేరణ పొందే కాంగ్రెస్ మేనిఫెస్టోను రూపొందించారని మోదీ విమర్శించారు. ఇక మూడో విడత ప్రచారంలో? మన్మోహన్ వీడియో పే రచ్చ అండ్ చర్చకు తెర లేపింది బీజేపీ. ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో ఇదే హాట్ టాపిక్. దేశ వనరులపై తొలి హక్కు ముస్లింలదే అన్న మాజీ ప్రధాని మన్మోహన్ వీడియో వెలుగులోకి వచ్చింది. అది బీజేపీకి ఆయుధంగా మారితే? కాంగ్రెస్‌ను ఆత్మరక్షణలో పడేస్తోంది. దేశ వనరులపై మొదటి హక్కు ముస్లింలదేనంటూ మన్మోహన్ సింగ్ గతంలో అన్నారని మోదీ స్పష్టం చేశారు. ఈ వీడియో చూశాక కాంగ్రెస్‌కు మాట పడిపోయిందంటూ ఎద్దేవా చేశారు. 2009 ఎన్నికల ప్రచారంలో అప్పటి కాంగ్రెస్ ప్రధాని మన్మోహన్ సింగ్ కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ వనరులపై తొలి హక్కు ముస్లింలకే ఉంటుందన్నారు ఆయన. దీంతో బీజేపీ ఎదురుదాడి దిగడంతో మన్మోహన్ అలా అనలేదు, అవన్నీ రూమర్లే అని ఇప్పటిదాకా చెప్పుకొచ్చింది కాంగ్రెస్. అయితే తాజాగా ఈ కామెంట్స్‌పై డిఫెన్స్‌లో పడిందంటున్నాయి పార్టీ వర్గాలు. ఇలా మూడో దశలో కాంగ్రెస్‌పై మరో తాజా అస్త్రంతో విరుచుకుపడుతోంది బీజేపీ.

## కాంగ్రెస్ - సీపీఎం మధ్య కుదిరిన దోస్తీ..



హైదరాబాద్ : పార్లమెంట్ ఎన్నికల పొత్తుపై తెలంగాణ కాంగ్రెస్ ప్రయత్నాలు ఫలించాయి. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి నడిచేందుకు కామ్రేడ్స్ సిద్ధమయ్యారు. ఇండియా కూటమిలో భాగమైన సీపీఐ, సీపీఎంను టీ.కాంగ్రెస్ నేతలు మద్దతు కోరారు తెలంగాణలో బీజేపీని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్‌తో కలిసి నడుస్తామని లెఫ్ట్ పార్టీలు ప్రకటించాయి. అయితే.. ఒక పార్లమెంట్ స్థానంలో మాత్రం షరతులు వర్తి? స్తాయంటున్నారు సీపీఎం నేతలు. తెలంగాణలోని తాజా రాజకీయ పరిణామాలపై సీపీఎం నేతలతో చర్చించామన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, వీరయ్యతోపాటు పలువురు కీలక నేతలు సీఎం నివాసంలో రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా.. పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతుపై చర్చించారు. భువనగిరి పార్లమెంట్‌తో పాటు ఇతర

### ఆ నియోజకవర్గం మినహా అన్నిచోట్ల మద్దతు!

స్థానాల్లోనూ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని సీపీఎం నేతలను కోరినట్లు చెప్పారు సీఎం రేవంత్‌రెడ్డి. ఎన్నికల్లో మద్దతుకు బదులుగా సీపీఎం నేతల ముందు కొన్ని రాజకీయ ప్రతిపాదనలు పెట్టామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో భేటీలో కీలక రాజకీయ అంశాలపై చర్చించామన్నారు తెలంగాణ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం. భువనగిరి పార్లమెంట్ స్థానంలో మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ కోరగా.. దానికి తాము అంగీకరించలేదని చెప్పారు. భువనగిరి సీటు విషయంలో సందిగ్ధం ఉన్నప్పటికీ.. మిగతా 16 స్థానాల్లో కాంగ్రెస్‌కు సీపీఎం మద్దతు కొనసాగుతుందని ప్రకటించారు తమ్మినేని వీరభద్రం. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యేక స్ట్రాటజీలతో ముందుకెళ్ళి తెలంగాణ కాంగ్రెస్ సక్సెస్ అయ్యింది. ఇప్పుడు అవే స్ట్రాటజీలను పార్లమెంట్ ఎన్నికల్లోనూ అమలు చేయబోతోంది. దానిలో భాగంగా.. సీపీఐ, సీపీఎంతో పొత్తు చర్చలు జరిపింది కాంగ్రెస్. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సీపీఐ, సీపీఎం ముఖ్య నేతలతో చర్చలు జరిపారు. ఆ తర్వాత.. ఇరు పార్టీల నేతలు పొత్తులకు సంబంధించిన వివరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలోనే పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతుపై హైదరాబాద్‌లో సీపీఎం నేతలతో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. సీపీఐ, సీపీఎం నేతలను కూడా ప్రత్యేకంగా ఆహ్వానించడంతో మూడు పార్టీల నేతలు ఈ ఎన్నికల్లో మద్దతుపై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కలిసి పనిచేయాలని మూడు పార్టీల నేతలు డిసైడ్ అయ్యారు. బీజేపీని తెలంగాణలో అధికారంలోకి రాకుండా అడ్డుకునేందుకు కాంగ్రెస్‌తో కలిసి పని చేస్తామని సీపీఐ, సీపీఎం పార్టీ నేతలు వెల్లడించారు.

## దమ్ముంటే హరీష్ రావు సవాల్‌కు రేవంత్ రెడ్డి స్పందించాలి : కేటీఆర్

హైదరాబాద్ : దమ్ముంటే హరీశ్‌రావు సవాల్‌కు రేవంత్ రెడ్డి స్పందించాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. రేవంత్ రెడ్డి తన సొంత జిల్లాలో గెలవడం కూడా కష్టమే అని కేటీఆర్ స్పష్టం చేశారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మీడియాతో చిట్‌చాట్ చేశారు. రేవంత్ రెడ్డిది మాట నిలుపుకున్న చరిత్ర కాదు.. కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం అన్నాడు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా గెలుస్తామని చెప్పి ఓడిపోయిన తర్వాత మాట తప్పాడు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోసం పార్ట్-1 జరిగింది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు మోసం పార్ట్ -2 కొనసాగుతోంది. ఎట్టి పరిస్థితుల్లో రేవంత్ రెడ్డి రుణమాఫీ చేయడు. నేతి బీరకాయలో నెయ్యి ఉండని తీరుగానే రేవంత్ రెడ్డి మాటల్లో నిజాయితీ ఉండదు. ముఖ్యమంత్రిగా అవకాశం ఇచ్చిన పార్టీకే రేవంత్ రెడ్డి కట్టుబడి లేడు. ఆయన ఏ సవాల్‌కు కట్టుబడి ఉన్నాడో చెప్పాలె? అని కేటీఆర్ డిమాండ్ చేశారు. బీజేపీని ఎదుర్కొనే శక్తి ప్రాంతీయ పార్టీలకు మాత్రమే ఉంది..



బీఆర్ఎస్ పార్టీ 10- 12 స్థానాలు సాధిస్తే కేంద్రంలో రానున్న ప్రభుత్వంలో కీలకపాత్ర వహించే అవకాశం ఉంటుందన్నారు కేటీఆర్. ఎన్డీఏ, ఇండియా కూటమిలో లేకుండా కూడా సుమారు 13 పార్టీలు బయట ఉన్నాయి. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు మాకు రాజకీయ ప్రత్యర్థులే. ఈ రెండు పార్టీలు చేసిన ద్రోహానికి దేశానికి ఎంతో నష్టం జరిగింది. అందుకే కాంగ్రెస్, బీజేపీలను తిరస్కరించి ప్రాంతీయ పార్టీలకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నాం. కాంగ్రెస్‌కు బీజేపీని ఎదుర్కొనే శక్తి లేదు? బీజేపీని ఎదుర్కొనే శక్తి ప్రాంతీయ పార్టీలకు మాత్రమే ఉంది. బీజేపీని ఎదుర్కొనే శక్తి లేకనే రాహుల్ గాంధీ ఉత్తర భారతదేశం నుంచి కేరళకు పారిపోయిండు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా, ఒత్తిడి చేసిన ఎదుర్కొని బీజేపీని తట్టుకుంటున్నది ప్రాంతీయ శక్తులే. ఒకనాడు ఎన్టీ రామారావు భారతదేశం అనే పార్టీ పెట్టాలనుకున్నాడు. కానీ ఆయన శిష్యుడు కేసీఆర్ జాతీయ పార్టీ పెట్టాడు. ఇప్పుడు కాకున్నా భవిష్యత్తులో అయినా విస్తరించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నాం. ప్రస్తుతానికి తెలంగాణలో పూర్వ వైభవం సంతరించుకోవటానికి కష్టపడుతున్నాం అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## లోక్ సభ ఎన్నికల వేళ ఈ నేతల మధ్య కొనసాగుతున్న సవాళ్ల పర్వం..

హైదరాబాద్ : పార్లమెంట్ ఎన్నికల వేళ తెలంగాణలో సవాళ్లపర్వం పీక్ స్టేజ్‌కు చేరుతోంది. ఇప్పటికే.. బీఆర్ఎస్- కాంగ్రెస్ మధ్య సవాళ్లు హోరాహోరీగా కొనసాగుతుండగా..తాజాగా బీజేపీ సీనియర్ నేత, ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కూడా ఎంట్రీ ఇచ్చారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్.. అమలు చేసినట్లు నిరూపిస్తే తాను పోటీ



నుంచి తప్పుకుంటానని బండి సంజయ్ ప్రకటించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేసినట్లు కాంగ్రెస్ నేతలు నిరూపిస్తే పోటీ నుంచి తప్పుకుని.. కాంగ్రెస్ తరపున ప్రచారానికి సిద్ధమన్నారు. తన సవాల్‌ను స్వీకరించే దమ్ము కాంగ్రెస్ నేతలకు ఉందా అని ఛాలెంజ్ విసిరారు బండి సంజయ్. అరు గ్యారెంటీలలో భాగంగా తెలంగాణ రాష్ట్ర మహిళలకు నెలకు రూ. 2500 బ్యాంకు అకౌంట్లలో వేస్తామన్నారు. వాటిని ఏ ఒక్క మహిళల ఖాతాలోనైనా వేసినట్లు నిరూపించండని డిమాండ్ చేశారు. అలాగే ఆసరా పెన్షన్లో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ. 4000 అకౌంట్లలో వేస్తామన్నారు. అలా ఈ పథకం ఏ ఒక్కరికైనా అందించినట్లు చూపించమని కోరారు. ఈ రెండింటినీ నిరూపిస్తే తాను కరీంనగర్ ఎంపీగా పోటీ నుంచి తప్పుకుంటానని చెప్పారు.

## కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాలకు ఇబ్బందులు

### మాయమాటలతో అధికారంలోకి వచ్చారు
### అవిర్భావ సభలో ఎమ్మెల్యే హరీష్ రావు

సిద్దిపేట,ఏప్రిల్27 : కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. మాయమాటలు చెప్పి ఆ పార్టీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయడం లేదన్నారు. తెలంగాణకు నష్టం జరిగిన ప్రతిసారి బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం చేసిందని చెప్పారు. ఒక్కడితో మొదలైన బీఆర్ఎస్ ప్రస్థానం ఉధృతమై ఉప్పెనగా మారి స్వరాష్ట్ర కలను సాకారం చేసిందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. తెలంగాణ భావజాల వ్యాప్తి చేసి ప్రజలను కేసీఆర్ చైతన్యపరిచారని తెలిపారు. అంగబలం, అర్థబలం కలిగిన ఆంధ్ర నాయకత్వాలను ఎదిరించి నిలబడ్డారని చెప్పారు. తెలంగాణ వాదాన్ని అణిచవేయాలన్న ప్రతిసారి ఉద్యమం మరింత ఉధృతం చేశారన్నారు. తన పదవులను గడ్డిపోచలుగా వదిలేసి ప్రజల్లో చర్చపెట్టి తెలంగాణ వాదాన్ని గెలిపించారన్నారు. జలదృశ్యం నుంచి జన దృశ్యంగా మారిన పరిణామంలో ఎన్నో ఎత్తుపల్లాలు, ఒడిదుడుకులు, అణచివేతలు, అనుమానాలు ఎదురయ్యాయని గుర్తుచేసుకున్నారు. బీఆర్ఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలు, పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే హరీశ్ రావు శుభాకాంక్షలు తెలిపారు. 23 ఏండ్ల సుదీర్ఘ ప్రయాణంలో కేసీఆర్ ఎన్నడూ ఎత్తిన జెండా దించలేదని, పట్టిన పట్టును విడువలేదని చెప్పారు. గులాబీ జెండానే గులాంగిరీని అంతం చేసి తెలంగాణను తెచ్చిపెట్టిందని వెల్లడించారు. పదేండ్ల పాలనలో ప్రజలకు అద్భుతమైన ప్రగతి ఫలాలు అందించిందన్నారు. ఈ ఘనత ముమ్మాటికీ గులాబీ జెండాదేనని చెప్పారు. ఆత్మగౌరవంతో బతికే జాతి తెలంగాణ జాతి అని వెల్లడించారు. ఆత్మగౌరవం దెబ్బతిన్నప్పుడల్లా ధిక్కార స్వరమై నిలిచిందని పేర్కొన్నారు. ఇప్పుడు మరోసారి ప్రజలకోసం ప్రజా ఉద్యమం చేసేందుకు బీఆర్ఎస్ సంసిద్ధమైందని హరీశ్ రావు అన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావం సందర్భంగా సిద్దిపేటలో పార్టీ కార్యాలయంలో గులాబీ జెండాను హరీశ్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదని చెప్పారు. మన పథకాలను బీజేపీ కాపీ కొట్టిందని విమర్శించారు. అభివృద్ధిలో కేసీఆర్ ఆదర్శంగా ఉంటే.. తిట్లలో రేవంత్ రెడ్డి ఆదర్శంగా ఉన్నారని చెప్పారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తే రాజీనామాకు సిద్ధంగా ఉన్నానని మరోసారి స్పష్టం చేశారు.



## రాయబరేలీ, అమేథీ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు.. సీఈసీ భేటీపై ఉత్కంఠ

లక్నో : గత కొంత కాలంగా ఉత్తర్‌ప్రదేశ్ రాయబరేలీ, అమేథీ లోక్‌సభ స్థానాల కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతూ వస్తోంది. ఈ తరుణంలో ఆ రెండు స్థానాల అభ్యర్థుల్ని ఖరారు చేసేందుకు ఇవాళ కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ (సీఈసీ) కానుంది. సీఈసీ సమావేశంలో కాంగ్రెస్ కంచుకోట రాయబరేలీ, అమోథీ స్థానాల్లో ఎవరు ఎన్నికల బరిలోకి దిగనున్నారనే అశంపై స్పష్టత రానుంది. గాంధీ -నెహ్రూ కుటుంబంలోని సభ్యులు గత కొన్ని దశాబ్దాలుగా ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ రాయబరేలి నుంచి పార్లమెంట్ సభ్యులుగా ఉంటూ వస్తున్నారు. అభివృద్ధి కార్యక్రమాలతో ఈ ప్రాంతాలను తమ కంచుకోటగా మార్చుకున్నారు. అక్కడి ప్రజలతో బలమైన సంబంధాలను ఏర్పరచుకున్నారు. కానీ, 2019లో జరిగిన



లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి స్మృతి ఇరానీ చేతిలో రాహుల్ గాంధీ అమేథీ నియోజకవర్గం నుంచి ఓడిపోయారు. అప్పటి నుంచి రాహుల్ గాంధీకి అమోథీతో అంటీముట్టనట్టుగానే వ్యవహరిస్తూనే వచ్చారు. పలు నివేదికల ప్రకారం.. నాటి నుంచి ఈ ఏడాది ప్రారంభం వరకు రాహుల్ కేవలం రెండు మూడు పర్యాయాలు మాత్రమే మాత్రమే అమేథీకి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆరోగ్య కారణాల వల్ల సోనియా గాంధీ రాయబరేలీ పోటీ నుంచి తప్పుకున్నట్లు ప్రకటించారు. ఆమె రాజ్యసభకు వెళ్తున్నట్లు తెలిపారు. అయితే, త్వరలో ఆ రెండు పార్లమెంట్ స్థానాలకు ఎన్నికలు జరగనుండగా.. అభ్యర్థుల్ని ఖరారు చేసేందుకు మరికొద్ది సేపట్లో సీఈసీ సభ్యుల భేటీ జరగనుంది.

## ఇక్కడ పార్టీల మధ్య కంటే ఇద్దరు మంత్రుల మధ్య పోటీ..

### ఆసక్తికరంగా మారిన లోక్‌సభ ఎన్నికలు!

హైదరాబాద్ : సాధారణంగా ఎన్నికల్లో పోటీ అంటేనే పార్టీల మధ్య ఉంటుంది. గెలుపు కోసం పార్టీల అభ్యర్థులు సర్వశక్తులు ఒడ్డుతారు. కానీ ఆ జిల్లాలో మాత్రం పార్లమెంట్ ఎన్నికల వేళ ఇద్దరు మంత్రుల మధ్య పోటీ నెలకొంది. ఇక్కడ పార్టీల మధ్య కంటే ఇద్దరు మంత్రుల మధ్య పోటీగా ఆ పార్టీ భావిస్తోంది. దీంతో ఆ మంత్రులకు పార్లమెంటు ఎన్నికలు సవాల్ గా మారాయి. ఆ టార్గెట్ కోసం మంత్రులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఏదా జిల్లా.. ఎవరా మంత్రులు..? అయితే మంత్రుల మధ్య ఉన్న పోటీ ఏంటో తెలుసుకోవాలంటే ఈ స్టోరీ చదవాల్సిందే. ఉమ్మడి నల్లగొండ జిల్లా అంటేనే కాంగ్రెస్‌కు కంచుకోట. రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయ ఉద్దండులంతా ఈ జిల్లా నుండే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో హేమ హేమీలైన సీనియర్ నేత జానారెడ్డి, మంత్రి ఉత్తమ్



కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి బ్రదర్స్, మాజీ మంత్రి దామోదర్ రెడ్డిలు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందినవారే. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాలకు గాను 11 స్థానాల్లో కాంగ్రెస్ విజయ దుందుభి మోగించి పూర్వవైభోవాన్ని చాటుకుంది. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ సర్కార్‌లో ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలు మంత్రులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ హవా కొనసాగినా, నల్లగొండ జిల్లాలోని రెండు పార్లమెంటు స్థానాల్లో కాంగ్రెస్ జయ కేతనం ఎగరవేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో లభించిన విజయంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ దూకుడు పెంచింది. ఈ ఎన్నికల్లో రెండు పార్టీలకు డిపాజిట్లు దక్కకుండా జిల్లా అగ్రనేతలు పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. సిట్టింగ్ స్థానాలను కాపాడుకోవడం కాంగ్రెస్‌కు పెద్ద కష్టమేమీ కాదు. కానీ నల్లగొండ, భువనగిరి స్థానాల్లో సాధించే మెజారిటీ పైనే కాంగ్రెస్ దృష్టి సారించింది. రెండు చోట్ల భారీ మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి ఉమ్మడి నల్గొండ జిల్లాకు ప్రత్యేకమైన గుర్తింపు తెస్తామని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు. భువనగిరిలో కాంగ్రెస్ అభ్యర్థి మూడు లక్షల మెజారిటీతో గెలిపించాలని సీఎం రేవంత్ రెడ్డి.. టార్గెట్ పెట్టగా, నాలుగు లక్షలతో గెలిపిస్తామని కోమటిరెడ్డి బ్రదర్స్ అన్నారు. దేశంలో నల్గొండ ఎంపీ సెగ్మెంట్ అత్యధిక మెజార్టీ సాధిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు.

# శ్రీ ప్రస్థానం

## సంపాదకీయం

### వలస బాట పడుతున్న విద్యార్థులు

మన యువతకు మన దేశంలోనే ఉద్యోగాలు దొరకకపోవడం వల్లనే కదా విదేశాలకు పరుగులు తీస్తున్నారు. మన పాలకులు మాత్రం ఓట్ల కోసం కోట్లు కోట్లు అప్పులు చేసి ఉచితాలపై రాయితీలపై సబ్సిడీలపై వ్యయం చేస్తున్నారు ఐక్యరాజ్య సమితి ప్రపంచ వలస రిపోర్టు 2022 ప్రకారం 1990 నుండి 2020 వరకు మన దేశం నుంచి 1.80 కోట్ల మంది వలసపోయారు. 2020 నాటికి ఒక్క అమెరికాలోనే 27 లక్షల మంది మనవారు స్థిరపడ్డారు. అమెరికాలో 45 లక్షల మంది, 25 లక్షలు, సౌదీలో 34 లక్షల మంది భారతీయులు స్థిరపడ్డారు, వీరు అధికంగా ఆయిల్ నిక్షేపాలున్న యునైటెడ్ అరబ్ దేశాల్లో పనిచేస్తున్నారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకారం 3.2 కోట్ల మంది భారతీయులు విదేశాలకు వెళ్లిపోయి ఓవర్సీస్ ఇండియన్స్‌గా ఉన్నారు. ప్రతి సంవత్సరం 25 లక్షల మంది భారతీయులు విదేశాలకు వలస పోతున్నారు ప్రపంచ బ్యాంకు ప్రకారం భారతదేశం జనాభా నిధిని సద్వినియోగం చేసుకోవడం లేదు. పేరుకేమో యంగ్ ఇండియా అయితే, ఈ యంగ్ యువత విదేశాల పాలవుతున్నది. జనాభాలో యువత ఎక్కువగా ఉంటే జనాభా నిధి అని అంటారు. మనదేశంలో చాలామందికి భూమిగానీ, పెట్టుబడులు గానీ, స్థిరాస్తులు గానీ లేవు. 90 శాతం ప్రజలకు వారి శ్రమే వారి జీవనాధారం. అతి తక్కువ ఆదాయాలతో ఉద్యోగ భద్రత లాంటివి లేని అభద్రతాభావంతో బ్రతుకు లాగుతున్న యువత... ఈ దేశంలో మనకు ఏముందిలే, ఎక్కడికో పోయి బ్రతుకుదాములే అనుకుంటూ, ఈ దేశ ఉత్పత్తి ప్రక్రియలో తమను ఉపయోగించుకునే వారే లేరని తీవ్ర నిరాశతో ఉన్నది. 2014 ఎన్నికల్లో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మాట ఏమైందో గానీ ఉన్న ఉద్యోగాలు పోయాయి. మన దేశ జీడీపీలో కుటుంబాల అప్పులు 2022-2023లో 40 శాతానికి చేరుకున్నది. ప్రజల పొదుపు శాతం మాత్రం ఐదు శాతానికి పడిపోయింది. ఇంత తక్కువ స్థాయిలో పొదుపు ఉండడం గత 47 సంవత్సరాల కాలంలో ఎప్పుడు లేదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలియజేస్తున్నది. 2011-12, 2019-20 మధ్య కాలంలో సగటున దేశ ప్రజల పొదుపు జీడీపీలో 7.6 శాతంగా ఉండేది. ప్రజల ఆదాయాలు క్రమంగా తగ్గిపోవడం వలన పెరుగుతున్న వినియోగ వ్యయం ఆదాయాల స్తబ్దత వలన మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలు అంటుతుండడం వలన పేదల వాటా జీడీపీలో క్రమంగా తగ్గిపోతున్నది. ఐక్యరాజ్యసమితి ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ వారి ప్రకారం 34 వంతు ప్రజలు పోషక ఆహార లోపంతో ఉన్నందువలన గత్యంతరం లేక మన పాలకులు 80 కోట్ల మందికి ఉచితంగా రేషన్ బియ్యం, 50 కోట్ల మందికి ఉచిత ఆరోగ్య కార్డులు ఇవ్వాల్సి వస్తోంది. ప్రపంచంలోనే ఇది అతిపెద్ద వలస అని చెప్పాల్సి ఉంటుంది. ఇలాంటప్పుడు దేశ ఆర్థిక అభివృద్ధి ఎలా జరుగుతుంది? సాధారణంగా తమ పిల్లలను బాగా చదివించగలిగితే తమ కుటుంబాలు బాగుపడతాయని తల్లిదండ్రులు భావిస్తారు. అయితే వారి ఆదాయ స్థాయి అంతంత మాత్రమే. అటువంటప్పుడు ప్రభుత్వాలే యువతకు కావలసిన సౌకర్యాలపై అంటే విద్య వైద్యం సాంకేతిక పరిజ్ఞానం తదితర వాటిపై ఖర్చుపెట్టి వీరిని దేశాభివృద్ధికి ఉపయోగించుకోవాలి. 2040 నాటికి మన జనాభాలో 59 శాతం మంది యువకులే ఉంటారు. మీరు మన దేశ అభివృద్ధికే కాకుండా ప్రపంచ దేశాల అభివృద్ధికి కూడా తోడ్పడుతూ, ప్రపంచానికే మెరిసే స్టార్స్ లాగా ఉంటారు. అయితే వారికి కావాల్సిన విద్య, వైద్య, ఆహారం తదితర వాటిపై ఖర్చు చేసే వారేరి. ఇండియా ఎంప్లాయిమెంట్ రిపోర్ట్ 2024 ప్రకారం భారతదేశంలో పని చేసే వయసు వారు (15-59) 2011లో 61 శాతం ఉండగా 2021 నాటికి 64 శాతానికి పెరిగింది. మన యువతలో ప్రతి సంవత్సరం 8 మిలియన్ల మంది ఉద్యోగాల కోసం ఎగబడుతున్నారు. అయితే ఆర్థిక కార్యకలాపాలలో వీరి శాతం 2011లో 52 శాతంగా ఉండగా, 2021 నాటికి 37 శాతానికి పడిపోయింది. 2022 లో నిరుద్యోగ యువత మొత్తం నిరుద్యోగులలో 82.9 శాతం అని ఈ నివేదిక తెలియజేసింది. జనాభాలో పనిచేసే వయసులో ఉన్న వారి శాతం పెరుగుతుంటే యువశక్తి పెరుగుదలకు చిహ్నం. ఆర్థిక అభివృద్ధిలో క్రియాశీలకంగా పాలుపంచుకునేది దేశాన్ని మునుముందు నడిపించేది యువతే. అటువంటిది వారే నిరాశ నిస్పృహలతో పని పాట లేకుండా ఉంటే ఈ దేశానికి దిక్కెవరు? పాలకులు నిరుద్యోగ యువతను నిర్లక్ష్యం చేస్తున్నందున యువత జాతి నిర్మాణంలో భాగస్వాములు కాలేకపోతున్నారు. మన పాలకులు వ్యవహరించే విధానాల వలన కోట్లకొలది యువతీ యువకులు నిరాశ నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్నారు. దీనివల్ల కుటుంబం సమాజం దేశం అశాంతికి గురవుతోంది. యువతలో నూతన ఉత్సాహం నింపి జీవితం పట్ల ఆశలు రేకెత్తించే అలాంటి విధాన కార్యక్రమాలు రూపొందించి చేపడితే, పాలకులు త్రికరణ శుద్ధిగా యువతీ యువకులను అధునాతన ప్రపంచంలో మమేకం చేయగలిగితే, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో కాలాన్ని మించిన వేగంతో యువత పరిగెత్తగలదు.

## జైల్లో కుదుటగానే కేజ్రీవాల్ ఆరోగ్యం: ఢిల్లీ ఎయిమ్స్

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో అరెస్టై తీహార్ జైల్లో ఉన్న సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోగ్యం ప్రస్తుతం కుదుటగానే ఉన్నట్లు తెలుస్తోంది. టైప్-2 డయాబెటిస్‌తో బాధపడుతున్న కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు అయిదుగురు డాక్టర్లతో కూడిన వైద్య బృందం ఆయనకు రెండు యూనిట్ల ఇన్సులిన్ అందిస్తోంది. ఈ మేరకు ఎయిమ్స్‌కు చెందిన అయిదుగురు వైద్యుల బృందం శనివారం కేజ్రీవాల్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. దాదాపు అరగంట పాటు ఆరోగ్య



పరిస్థితిపై ఆరాతీశారు. ప్రస్తుతం కేజ్రీవాల్ పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు ధ్రువీకరించినట్లు తెలుస్తోంది. ఈమేరకు జాతీయ మీడియా కథనాలు వెల్లడించింది. కేజ్రీవాల్ ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నందున, ఆయన ఉపయోగిస్తున్న మందులనే కొనసాగించాలని మెడికల్ బోర్డు సూచించిం.ది మెడిసిన్‌లో ఎలాంటి మార్పులు చేయాల్సిన అవసరం లేదు పేర్కొంది. దీంతో పాటు ఆయనకు రెండు యూనిట్ల ఇన్సులిన్ డోసును కొనసాగించాలని తెలిపింది' అని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. వారం తర్వాత ఈ బృందం సీఎంను మరోసారి పరీక్షించనున్నట్లు పేర్కొన్నాయి. కాగా ఆయన షుగర్ లెవల్స్ 320కు పెరగడంతో గతవారం తీహార్ జైల్లో తొలి ఇన్సులిన్ అందించారు. తన వ్యక్తిగత వైద్యుడితో రోజూ వీడియో మాధ్యమంలో సంప్రదించే అవకాశాన్ని కల్పించాలంటూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ కోర్టు తిరస్కరించిన విషయం తెలిసిందే. ఆరోగ్య కారణాల కింద బెయిల్ పొందేందుకే చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉండే స్వీట్స్, మామిడిపండ్లు, ఆలూపూరీ వంటి ఆహార పదార్థాలు తీసుకుంటున్నారని దర్యాప్తు సంస్థ ఆరోపించింది. దీనిపై వాదనలు విన్న న్యాయస్థానం.. కేజ్రీవాల్ అభ్యర్థనను తోసిపుచ్చింది. అయితే టైప్ 2 డయాబెటిక్ పేషెంట్ అయిన కేజ్రీవాల్‌కు క్రమం తప్పకుండా ఇన్సులిన్ అవసరమా?, ఇతర ఆరోగ్య సమస్యలేమైనా ఉన్నాయా? అని నిర్ణయించేందుకు ఎయిమ్స్ వైద్యులతో కూడిన కమిటీని ఏర్పాటుచేయాల్సిందిగా ఆదేశించింది. ఇంట్లో వండిన ఆహారాన్ని కూడా కోర్టు అనుమతించింది. అయితే అది ఖచ్చితంగా డాక్టర్ సూచించిన డైట్ చార్ట్‌కు కట్టుబడి ఉండాలని పేర్కొంది.

## మోదీ సర్కార్ వెళ్లిపోయింది: చిదంబరం కీలక వ్యాఖ్యలు

ఢిల్లీ: భారతదేశంలో రెండు దశల ఎన్నికలు పూర్తయ్యాయి. ఇంకా ఐదు దశల్లో ఎన్నికలు జరగాల్సి ఉంది. ఇంకా ప్రధాన పార్టీల కీలక నేతలు ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. ఈ తరుణంలో తమ పార్టీ మేనిఫెస్టోపై నిరంతరం విమర్శలు చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ సీనియర్ నేత పీ చిదంబరం మండిపడ్డారు. ప్రారంభంలో కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రధాని మోదీ పట్టించుకోలేదు. ఏప్రిల్ 19న మొదటి దశ ఎన్నికలు పూర్తయిన తరువాత మేనిఫెస్టో మీద తీవ్రంగా విమర్శిస్తూ వస్తున్నారు. మొదటి దశ ఎన్నికల తర్వాత మేనిఫెస్టో కొత్త స్థాయిని సంతరించుకుందని చిదంబరం పేర్కొన్నారు. మోదీ సర్కార్ వెళ్లిపోయింది. ఇది కొన్ని రోజులకు ముందు బీజేపీ సర్కార్. నిన్నటి నుంచి ఎన్డీయే సర్కార్. ఏప్రిల్ 19 నుంచి సంభవించిన నాటకీయ మార్పును మీరు గమనించారా? అంటూ పీ చిదంబరం తన ఎక్స్ (ట్విటర్) ఖాతాలో ట్వీట్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళల మంగళసూత్రాలకు ముప్పు వాటిల్లుతుందన్న బీజేపీ మాటలపైన ఆయన విరుచుకుపడ్డారు. గత మూడు, నాలుగు రోజులుగా బీజేపీ చెబుతున్నదంతా అబద్ధం. మేనిఫెస్టోలో ఎక్కడైనా పునర్విభజన అనే ఒక్క పదాన్ని నాకు చూపించండి. సంపదను పునఃపంపిణీ చేయడం వంటి పాదాలను ఎక్కడైనా చూపించండి. అది మా మేనిఫెస్టోలో లేదని చిదంబరం అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ముస్లింలకు రిజర్వేషన్లు కల్పిస్తామన్న బీజేపీ వాదనలపై మాట్లాడుతూ.. మేనిఫెస్టోలో ఎక్కడ ఉంది. గత నాలుగు రోజులుగా బీజేపీ నేతలు చేస్తున్న ప్రకటనలన్నీ పూర్తిగా ఊహాజనితమైనవే.



అది ఎక్కడ ఉందో చూపించాలి. మేనిఫెస్టోలో నేను వారికి బహిరంగంగా సవాలు విసురుతున్నాను అని చిదంబరం అన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ ను గెలిపించండి

**-ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ వెంకట నారాయణ**

ములుగుదేశ భవిష్యత్తును నిర్ణయించే పార్లమెంట్ ఎన్నికల సందర్భంలో ప్రజల ఆర్థిక సమస్యలు చర్చించాలని గత పది సంవత్సరాల నుండి అమలు చేసిన విధానాల పర్యవసానాలు దుష్ఫలితాలను ఎత్తిచూపాలని ములుగు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రెస్ కాన్ఫరెన్స్ లో ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ మాట్లాడుతూ ప్రస్తుతము జరుగుతున్న పార్లమెంటు ఎన్నికలు ప్రజల ఆర్థిక సామాజిక సమస్యల పరిష్కారానికి, కార్పొరేట్ సంస్థల దోపిడి వ్యవస్థలకు మధ్యన జరుగుతున్న ఎన్నికలుగా భావించవలసిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. నరేంద్ర మోడీ పాలనలో



పేదలు మరింత ఆర్థిక సంక్షోభంలోకి నెట్టు వేయబడ్డారని, దేశంలో ఎన్నడూ లేనంత నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందని, విద్యావంతులైన యువతీ, యువకులు ఉద్యోగాలు లభించక సాంఘిక భద్రత లేకఆశాంతికి గురి అవుతున్నారు. దేశ సంపదలోని74% కేవలం 10 శాతం ఉన్నత వర్గాలకూ దారా దత్తం చేసినారని అన్నారు. నరేంద్ర మోడీ ఆర్థిక విధానాలు 90 శాతం దేశ ప్రజలకు తీవ్ర విగాథం కలిగిస్తున్నదని దుయ్యబట్టారు. గత పది సంవత్సరాలలో 10 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, నల్ల చట్టాలను రద్దు చేయాలని ఢిల్లీలో సంవత్సరకాలం రైతులంతా ధర్నాలు చేస్తే 750 మంది రైతులను పొట్టన పెట్టుకున్నారని, కార్పొరేట్లకు దోచి పెట్టేందుకు వ్యవసాయ రంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు. నయవంచన చేసిన నరేంద్ర మోడీ ప్రభుత్వానికి మరొకసారి మద్దతు పలకడం ఏ విధంగా సాధ్యమని ప్రశ్నించారు. అంబేద్కర్ రాజ్యాంగంలో బడుగు బలహీన వర్గాలకు ఆమాత్రం అందిస్తున్న రిజర్వేషన్లు కూడా తీసివేయడానికి కుట్ర జరుగుతుందని, నరేంద్ర మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల సందర్భంగా దేశ ప్రజలందరికీ ఐదు గ్యారెంటీలు, 25 అంశాల మేనిఫెస్టో లో ప్రకటించినటువంటి కాంగ్రెస్ కు పట్టం కట్టాలని, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుస్తూ తెలంగాణ రాష్ట్రంలోని 17 సీట్లలో అధికార పార్టీ అయిన కాంగ్రెస్ కు సంపూర్ణ మెజారిటీ ఇచ్చి గెలిపించాలని ప్రజాసంఘాలన్నీ కూడా నినదిస్తున్నాయి. అదానీ,అంబానీ వేదాంత మొదలైన 162 బీలియనర్స్ లక్షల కోట్ల ఆస్తులు కలిగిన కుబేరుల నియంత్రణలో మాత్రమే నరేంద్ర మోడీ ప్రభుత్వం పని చేస్తున్నదని, భవిష్యత్తులో పేద ప్రజలకు బ్రతకడం సాధ్యం కాకపోవచ్చని ఆవేదన వెలుబుచ్చారు . దేశములోని 450 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు కేంద్ర నిధులు ఇవ్వకపోవడం వల్ల మూసివేతకు సిద్ధమైనాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత పది సంవత్సరాల నుండి ప్రైవేటు విద్యాసంస్థలను యూనివర్సిటీలను ప్రోత్సహించడం వలన దేశంలో 90 శాతం ప్రజల పిల్లలు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారన్నారు. మళ్లీ మోడీని గెలిపిస్తే రాజ్యాంగాన్ని మార్చి ముఖ్యంగా బీసీ ఎస్సీ ఎస్టీ ఇతర బీద వర్గాలకు ఇచ్చే రిజర్వేషన్లు కూడా తీసివేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందుకోసం రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు, కేంద్రంలో రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడి 5 గ్యారెంటీలు అమలు చేయించుకునే బాధ్యత ఈ రాష్ట్ర ప్రజల పై ఉందని దానికోసం కాంగ్రెస్ ను గెలిపించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో, పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు, కాకతీయ యూనివర్సిటీ, జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ సంగని మల్లేశ్వర్, దయాల సుధాకర్ బీసీ న్యాయవాదుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గునిగంటి శ్రీనివాస్ గౌడ్ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్, ముంజాల బిక్షపతి గౌడ్ ప్రజా సంఘాల ములుగు జిల్లా అధ్యక్షులు గూడూరు మహిపాల్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో ప్రలోభాలను నివారించేందుకు గట్టి నిఘా

**: వ్యయ పరిశీలకులు ఏ. దిలీబన్**

తొర్రూరుఎన్నికల్లో ప్రలోభాలను నివారించేందుకు గట్టి నిఘా ఉంచాలని కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు ఏ. దిలీబన్ పేర్కొన్నారు. శనివారం వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధి పాలకుర్తి అసంబ్లీ సెగ్మెంట్ లోని రాయపర్తి మండలం కిష్టాపూర్ వద్ద ఏర్పాటుచేసిన చెక్ పోస్టు, తొర్రుర్ మిల్క్ సెంటర్ వద్ద



గల చెక్ పోస్టులను దిలిబన్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూచెక్ పోస్ట్ లో తనిఖీ చేయు నిఘా సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఏవైనా ఎన్నికలకు సంబందించిన డబ్బు,మద్యం, గిఫ్ట్ తరలించినా వెంటనే అధికారులు సీజ్ చేయాలనీ సూచించారు. ఎన్నికలకు సంబందించిన పోటీ చేయు అభ్యర్థులు ఖర్చులు ఎప్పటికప్పుడు జమ రిజిస్టర్ లో నమోదు చేయాలనీ కోరారు. అనుమతులు పొందిన వాహనాలను మాత్రమే ప్రచారానికి ఉపయోగించాలని తెలిపారు. అనుమతులు లేకుండా అభ్యర్థులు సభలు, ర్యాలీలు నిర్వహించ రాదని,నిబంధనలు అతిక్రమిస్తే ఎన్నికలు చట్టాలు అమలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎన్నికల వ్యయ పరిశీలకులు ఏ. దిలీబన్ తొర్రుర్‌లోని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డ్ లను పరిశీలించి గత మార్చి16 ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుండి నమోదు చేసిన కేసులు, బైండోవర్ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్ రావు, స్టేషన్ ఇంచార్జి శ్రీనివాస్, ఎస్ ఐ లు తిరుపతి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## కోమటిరెడ్డి.. మాటలు జాగ్రత్త: కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు




కరీంనగర్: ఎన్నికల వేళ తెలంగాణలో రాజకీయం హీటెక్కింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తాజాగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కాగా, పాడి కౌశిక్ రెడ్డి శనివారం మీడియాతో మాట్లాడుతూ..'కోమటిరెడ్డి వద్ద 22 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారని నాకు ఫోన్ చేశారు. వారంతా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కానీ, నేను ఆయన మాటలు నమ్మలేదు. ఆయనన్ను మెంటల్ ఆసుపత్రిలో చేర్పించాలి. కేసీఆర్‌కు సైనికులుగా వేమంతా ఉన్నాము. హరీశ్‌రావును చూసి పని ఎలా చేయాలో కోమటిరెడ్డి నేర్చుకోవాలి. హరీశ్ రావు మాట్లాడిన దాంట్లో తప్పేముంది?. కాంగ్రెస్ పార్టీని నిలదీయడం తప్పా?. మీరు ఒక్క మాట అంటే మేము వంట మాటలు అనడానికి సిద్ధం.. నోరు జాగ్రత్తగా పెట్టుకోండి వెంకటరెడ్డి. కేసీఆర్ కోసం ముమ్మాటికీ మేము పనోళ్లమే అవుతాం. మీరు మాట మీద ఉంటే చెప్పిన ఆరు గ్యారంటీలు అమలు చేయండి. మీరు ఇచ్చిన హామీలు అమలు చేస్తే నేనే హరీశ్ రావుతో రాజీనామా చేయిస్తాను' అని కామెంట్స్ చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి. 15 మందికి గాయాలు

నిజామాబాద్ రూరల్: మొక్కు చెల్లించుకునేందుకు దర్గా వద్దకు వెళ్తుండగా జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు మృత్యువాతపడ్డారు. మరో 15 మంది గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన రెంజర్ల స్వామి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులతో కలిసి గురువారం రాత్రి తొమ్మిది గంటలకు ఐచర్ వ్యాన్‌లో వర్ని మండలంలోని బడాపహాడ్ దర్గాకు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న వాహనం నిజామాబాద్ రూరల్ మండలంలోని మల్కాపూర్ గ్రామ శివారులో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో రెంజర్ల వసంత(30), రెంజర్ల శ్యాంసుందర్(48) అక్కడికక్కడే మృతి చెందారు. వ్యాన్‌లో ప్రయాణిస్తున్న మరో 15 మందికి గాయాలయ్యాయి. ఇందులో ఇద్దరు మహిళల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. క్షతగాత్రులు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రితోపాటు మరో రెండు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఎంపీ అరి?వంద్, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, ఎంపీ అభ్యర్థులు బాజిరెడ్డి గోవర్ధన్(బీఆర్ఎస్), జీవన్‌రెడ్డి(కాంగ్రెస్) బాధితులను శుక్రవారం పరామర్శించారు. డ్రైవర్ నిర్లక్ష్యంతో అతివేగంగా వాహనాన్ని నడపడం వల్లే ప్రమాదం జరిగిందని బాధితులు ఆరోపిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఐచర్ వ్యాన్ డ్రైవర్ కృష్ణపై కేసు నమోదు చేశామని నిజామాబాద్ రూరల్ ఎస్‌హెచ్‌వో చైతన్యరెడ్డి తెలిపారు. కమ్మర్‌పల్లి: వ్యాన్ బోల్తాపడిన ఘటనలో మృతి చెందిన రెంజర్ల శ్యాంసుందర్ రెండు కుటుంబాలకు పెద్ద దిక్కుగా ఉన్నాడు. మండల కేంద్రానికి చెందిన శ్యాంసుందర్ 19ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన ఏనుగు అంజయ్య కూతురు భారతిని వివాహం చేసుకొని ఇల్లరికం వెళ్లాడు. శ్యామ్‌సుందర్ తండ్రి రెంజర్ల చిన్న నర్సయ్య 12ఏళ్ల క్రితం, మామ అంజయ్య కొన్నేళ్ల క్రితం కొవిడ్‌తో మరణించారు. దీంతో అటు తన కుటుంబ బాధ్యతలతోపాటు ఇటు అత్తవారింటి బాధ్యతలను శ్యాంసుందర్ చూసుకుంటున్నాడు. పెద్దదిక్కైన శ్యాంసుందర్ మృతితో రెండు కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో పడ్డాయి.

## 8 మందికివంద కోట్లపైనే ఆస్తులు

హైదరాబాద్, ఏప్రిల్ 27 తెలంగాణలో పోటీ చేస్తున్న పలువురి అభ్యర్థుల ఆస్తులు వంద కోట్లకు పైగా ఉన్నాయి. ఈ లిస్ట్ లో ఎనిమిది మంది ఉన్నారు. ఆయా అభ్యర్థులు వారి కుటుంబ ఆస్తులతో కలిపి రూ.100 కోట్లకు పైగా ఆస్తులను ప్రకటించారు. ఇందులో స్థిర, చర ఆస్తులు ఉన్నాయి. రాష్ట్రంలోని చేవెళ్ల నుంచి భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి పోటీ చేస్తున్నారు. మొత్తం 4,568 కోట్ల రూపాయల సంపదతో అత్యంత సంపన్న అభ్యర్థిగా నిలిచారు. చేవెళ్లలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రత్యర్థిగా కాంగ్రెస్ తరపున బరిలో ఉన్న రంజిత్ రెడ్డి ఆస్తులు కూడా భారీగానే ఉన్నాయి. మొత్తం రూ.435.33 కోట్లతో రెండో ధనవంతుడిగా నిలిచారు. అప్పులు రూ.23 కోట్లుగా ఉన్నాయి. ఆయన కుటుంబానికి రూ.294.33 కోట్ల విలువైన చరాస్తులు ఉండగా, స్థిరాస్తుల విలువ రూ.141 కోట్లు. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే? చేవెళ్ల నుంచి బీఆర్ఎస్ తరపున పోటీ చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్ కూడా అత్యధిక సంపద కలిగిన అభ్యర్థిగా ఉన్నారు. ఆయన తెలంగాణ రాష్ట్రం నుంచి రిచెస్ట్ ఎంపీ అభ్యర్థుల జాబితాలో మూడో స్థానంలో నిలిచారు. ఆయన మొత్తం సంపద రూ.228.46 కోట్లుగా ప్రకటించారు. అసదుద్దీన్ ఒవైసీపై హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా కె మాధవిలతా పోటీ చేస్తున్నారు. బీజేపీ నుంచి బరిలో ఉన్న ఆమె ఆస్తులు? మొత్తం రూ.218.38 కోట్లుగా ఉన్నాయి. రూ.27 కోట్ల వరకు అప్పులు కూడా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి సమీర్ వలీవుల్లాను కాంగ్రెస్ పోటీకి దింపిన సంగతి తెలిసిందే. వంద కోట్లకుపైగా ఆస్తులను ప్రకటించిన అభ్యర్థులు వీరే? ఖమ్మం లోకసభ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి పోటీ చేస్తున్న నామా నాగేశ్వర్‌రావు నికర సంపద రూ.155.89 కోట్లుగా ప్రకటించారు. భువనగిరి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న క్యామ మల్లేశ్ రూ. 145.33 కోట్ల ఆస్తుల(కుటుంబ సభ్యులతో కలిపి)ను కలిగి ఉన్నారు. నిజామాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ధర్మపురి అర్వింద్? మొత్తం నికర ఆస్తుల విలువ 109.89 కోట్లుగా ప్రకటించారు. మొత్తం అప్పుల విలువ రూ.30.67 కోట్లుగా ఉంది. జహీరాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీబీ పాటిల్ ఆస్తులు రూ. 151 కోట్లుగా ఉంది. కంచర్ల కృష్ణారెడ్డి, గాలి అనిల్ కుమార్ రూ. 50 కోట్లకుపైగా ఆస్తులు కలిగి ఉన్నారు. తెలంగాణలో లోకసభ ఎన్నికలకు మే 13న పోలింగ్ జరగనుండగా.. జూన్ 4న ఫలితాలు వెల్లడికానున్నాయి.



## బడ్జెట్ ముఖ్యమా? సినిమా కంటెంట్ ముఖ్యమా?

హాలీవుడ్ లో పరిమిత బడ్జెట్లతో అద్భుతమైన సినిమాలు తెరకెక్కి ప్రజలను అలరించాయి. పారా నార్మల్ యాక్టివిటీ లాంటి చిన్న బడ్జెట్ సినిమా ప్రపంచవ్యాప్తంగా వందల కోట్లు వసూలు చేసిన వైనం అందరినీ ఆశ్చర్యపరిచింది. అంతకుముందు ఆ తర్వాత కూడా చాలా సినిమాల్ని పరిమిత బడ్జెట్ పరిమిత క్యాస్ట్ అండ్ క్రూతో నిర్మించి హాలీవుడ్ అసాధారణ వసూళ్లను అందుకుంది. అదే బాటలో బాలీవుడ్ లోను చాలామంది దర్శకనిర్మాతలు పెద్ద సక్సెసయ్యారు. అనురాగ్ కశ్యప్, సుజోయ్, విధు వినోద్ చోప్రా వంటి దర్శకులు పరిమిత బడ్జెట్లలో అద్భుతమైన కంటెంట్ ఉన్న సినిమాల్ని తెరకెక్కించారు. అసాధారణ విజయాల్ని అందుకున్నారు. అయితే పరిమిత బడ్జెట్లో సినిమాలు తీసిన వీరంతా ఆ తర్వాత పెద్ద బడ్జెట్ సినిమాలకు మరలి అక్కడ కొన్ని సార్లు విజయం సాధించి, మరికొన్ని సార్లు ఫెయిలయ్యి, పంపిణీ వర్గాల్లో తీవ్ర నష్టాలకు కారకులయ్యారు. క్లీవెజ్ షో తెలుగు చిత్ర పరిశ్రమలోను చాలా మంది దర్శకులు చిన్న బడ్జెట్ సినిమాలతో అద్భుతమైన కంటెంట్ ని అందించిన వారున్నారు. దర్శకరత్న డా.దాసరి నారాయణరావు కెరీర్ లో చిన్న బడ్జెట్ సినిమాలను తెరకెక్కించి గొప్ప విజయాలను అందుకున్నారు. ఆయన ప్రతిభకు కొలమానంగా దర్శకరత్న బిరుదునందుకున్నారు. దాసరి మారుతి ఈ రోజుల్లో లాంటి చిన్న బడ్జెట్ సినిమాని తెరకెక్కించి పెద్ద విజయం అందుకున్నాడు. ఆ తరవాతా పరిమిత బడ్జెట్ చిత్రాలతో



ఆకట్టుకున్నాడు. హ్యాపీడేస్- గోదావరి లాంటి సినిమాలను చిన్న బడ్జెట్లతో రూపొందించిన శేఖర్ కమ్ముల గొప్ప విజయాలు అందుకున్నారు. నేటితరం దర్శకుల్లో పలువురు చిన్న బడ్జెట్లతో పెద్ద విజయాలు అందుకున్నవారున్నారు.ఈ దర్శకులంతా ఇప్పుడు కేవలం పెద్ద బడ్జెట్ సినిమాలను మాత్రమే తెరకెక్కించేందుకు ఆసక్తిగా ఉన్నారు. నిజానికి సినిమాకి కావాల్సినది బడ్జెట్ రేంజా లేక కంటెంటా? అన్నది ఎప్పుడూ ప్రశ్నార్థకమే. పెద్ద బడ్జెట్ పెద్ద కాన్వాసులో సినిమాలను తెరకెక్కించేందుకు చాలా మంది ప్రయత్నిస్తున్నారు. తాజాగా అనుపమ నటించిన పరద అనే చిత్రాన్ని పరిమిత బడ్జెట్ లో రూపొందిస్తున్నారని భావించినా ఈ సినిమా బడ్జెట్ కాన్వాస్ ఆశ్చర్యపరిచాయి. సినిమా బండి లాంటి పరిమిత బడ్జెట్ చిత్రాన్ని అందించిన ప్రవీణ్ కాండ్రేగుల ఈసారి పెద్ద బడ్జెట్ తో సాహసం చేస్తున్నారు. అయితే విజయం అందుకున్న దర్శకులను నమ్మి నిర్మాతలు రాజీ లేకుండా పెట్టుబడులు పెడుతున్నారు. దానికి తగ్గట్టే బిజినెస్ వర్గాల్లోను వారికి మంచి సానుకూలత ఉందని విశ్లేషిస్తున్నారు. అలాగే చిన్న సినిమా కంటే పెద్ద సినిమాకు బిజినెస్ రిస్క్ ఉండదని కూడా దర్శకనిర్మాతలు భావిస్తుంటారు. చిన్న సినిమాకి పెద్దన్న సపోర్ట్ లేనిదే బిజినెస్ అవ్వదు. అందువల్ల చాలా మంది చిన్న సినిమా జోలికే వెళ్లరు. కానీ నేటితరం ప్రతిభావంతులు తమ ట్యాలెంట్ నే పెట్టుబడిగా పెట్టి నిర్మాతలకు అద్భుతమైన ఫలాల్ని అందిస్తున్నారనడంలో సందేహం లేదు.

## అందాల విలన్ క్లీవెజ్ షో

నాగిన్ లో శివన్యా పాత్ర పోషించి దేశవ్యాప్తంగా పాపులారిటీ సొంతం చేసుకున్న మౌనీ రాయ్ సినిమాలతో కూడా మెప్పించింది. బుల్లి తెర నుంచి వెండి తెరకు ఎంట్రీ ఇచ్చిన మౌనీ రాయ్ ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలతో తెగ సందడి చేస్తున్న విషయం తెల్సిందే. బ్రహ్మాస్త్ర సినిమాలో లేడీ విలన్ గా కనిపించిన మౌనీ రాయ్ నటనకు మంచి మర్కులు పడ్డాయి. ముందు ముందు లేడీ విలన్ పాత్రలకు మౌనీ రాయ్ మోస్ట్ వాంటెడ్ గా మారే అవకాశాలు ఉన్నాయి. నటిగా వరుసగా సినిమాలు చేస్తున్న ఈ అమ్మడు సోషల్ మీడియాలో ఇలాంటి అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తోంది.సింపుల్ అండ్ స్వీట్ లుక్ లో అందాల క్లీవేజ్ షో తో ముద్దుగుమ్మ మౌనీ రాయ్ ఆకట్టుకుంది. ఈ రేంజ్ లో అందాల ఆరబోత చేసిన మౌనీ రాయ్ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. నాలుగు పదుల వయసుకు చేరువ అయినా కూడా పాతికేళ్ల పడుచు అందం కి ఏమాత్రం తగ్గకుండా మౌనీ రాయ్ అందాల షో ఉంటుంది. క్యూంకీ సాస్ భీ కభీ బహూ థీ సీరియల్ లో కృష్ణ తులసి పాత్రలో నటించడం ద్వారా హిందీ ప్రేక్షకులకు సుపరిచితురాలు అయిన ఈ అమ్మడు మహాదేవ్ లో సతీదేవి పాత్రను పోషించి దేశ వ్యాప్తంగా మంచి పాపులారిటీని సొంతం చేసుకుంది. 2014 లో ఝలక్ దిఖలాజా డాన్స్ షో లో ఫైనలిస్ట్ గా నిలిచిన మౌనీ రాయ్ స్వతహాగా కథక్ డాన్సర్. ఎన్నో అద్భుతమైన పాత్రల్లో మెరిసిన మౌనీ రాయ్ మరో పదేళ్ల పాటు నటిగా స్క్రీన్ పై ఆకట్టుకుంటూనే, అందాల ఆరబోతతో సోషల్ మీడియాలో సందడి చేయబోతుందని ఈ పిక్స్ చూస్తే అనిపిస్తుంది.




# 'రత్నం' మూవీ రివ్యూ

నటీనటులు: విశాల్-ప్రియా భవాని శంకర్-సముద్రఖని-మురళీ శర్మ-యోగి బాబు-విజయ్ కుమార్-జయప్రకాష్-తులసి తదితరులు సంగీతం: దేవిశ్రీ ప్రసాద్ ఛాయాగ్రహణం: సుకుమారన్ నిర్మాత: కార్తికేయన్ సంతానం రచన-దర్శకత్వం: హరి తమిళంతో పాటు తెలుగులోనూ మంచి మాస్ ఫాలోయింగ్ ఉన్న హీరో విశాల్. దర్శకుడు హరి కూడా మాస్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్ అన్న సంగతి తెలిసిందే. వీళ్లిద్దరి కలయికలో ఇప్పటికే భరణి.. పూజ సినిమాలు వచ్చాయి. ఇప్పుడు విశాల్-హరి కలిసి చేసిన మరో మాస్ మూవీ.. రత్నం. ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్ర విశేషాలేంటో చూద్దాం పదండి. సినిమా కంటెంట్ ముఖ్యమా? కథ: రత్నం (విశాల్) ఓ అనాథ. అతను తమిళనాడు బోర్డర్ లో ఉండే చిత్తూరులో ఎమ్మెల్యే (సముద్రఖని)కి కుడి భుజంగా ఉంటూ సెటిల్మెంట్లు చేస్తుంటాడు. అతడికి అనుకోకుండా మల్లిక (ప్రియా భవాని శంకర్)తో పరిచయం అవుతుంది. ముందు రత్నంను అపార్థం చేసుకున్న మల్లిక.. తర్వాత తన గురించి తెలిసి అభిమానిస్తుంది. ఆమెను గుర్తు తెలియని వ్యక్తులు చంపాలని ప్రయత్నిస్తుంటే.. రత్నం అండగా నిలుస్తాడు. ఒకదాని తర్వాత ఒకటి ఆమె మీద ఎటాక్స్ జరుగుతూనే ఉంటాయి. దీని వెనుక ఆంధ్ర-తమిళనాడు సరిహద్దుల్లో ఉండే స్థలాలను కబ్జా చేస్తూ తిరుగులేని స్థాయికి ఎదిగిన లింగం (మురళీ శర్మ) ఉన్నాడని తర్వాత తెలుస్తుంది. ఇంతకీ లింగం.. మల్లిక మీద ఎందుకు కక్షగట్టాడు.. అతడి నుంచి మల్లికను రత్నం కాపాడుకున్నాడా లేదా... మల్లిక మీద రత్నం అంత అభిమానం చూపించడానికి కారణమేంటి.. అన్నది తెర మీదే చూడాలి.విశాల్ అంటేనే మాస్. భారీ యాక్షన్ సీక్వెన్సులకు అతను పెట్టింది పేరు. ఫైట్లు లేని అతడి సినిమా ఉండదు. ఇక దర్శకుడు హరిది కూడా మాస్ బాటే. వీళ్లిద్దరూ కలిసి సినిమా చేస్తే ఫైట్ల మోత మోగిపోవడం ఖాయం అని ప్రేక్షకులకు అంచనా ఉంటుంది. 'రత్నం'లో కూడా బోలెడన్ని ఫైట్లున్నాయి. ఆ ఫైట్లు ఏ నేపథ్యంలో సాగుతాయో ఓసారి చూద్దాం. ముందుగా తొలి ఫైట్ విషయానికి వ్తే.. హీరోయిన్ కాలేజీలో ఎగ్జామ్ రాయడానికి వెళ్తుంటుంది. ఆమె మీద ఒక గ్యాంగ్ ఎటాక్ చేస్తుంది. హీరో ఫైట్ చేసి కాపాడతాడు. ఆ తర్వాత హీరోయిన్ బస్సులో ఊరెళ్తుంటుంది. మధ్యలో ఒక గ్యాంగ్ ఎటాక్ చేయబోతే.. మళ్లీ సరిగ్గా అదే టైంకి హీరో ఎంట్రీ ఇచ్చి ఫైట్ చేసి ఆమెను రక్షిస్తాడు. ఇది రెండో ఫైట్. ఇక మూడోసారేమో హీరోయిన్ ఇంటి మీదికే రౌడీలు దండెత్తి వస్తారు. మళ్లీ హీరో రంగంలోకి దిగి ఓ పాతిక శవాల దాకా లేపుతాడు. నాలుగో ఫైట్ హీరోయిన్ ఇంటి వెనుక ఉండే పచ్చిక బయళ్లలో అన్నమాట. ఈసారి రొటీన్‌గా కాకుండా ఏవో వేషాలేసుకుని వస్తుంది రౌడీ బ్యాచ్. మళ్లీ హీరోయిన్ మీద కత్తి వేటు పడబోతుంటే.. సరైన టైమింగ్ లో హీరో ఎంట్రీ ఇచ్చి అందరినీ లేపేస్తాడు. ఇక ఐదో ఫైటేమో హీరోయిన్ మెడిసిన్ సీటులో అడ్మిషన్ తీసుకుంటే.. అక్కడ్నుంచి మొదలై హైవే మీదికి వస్తుంది. హీరో ఎప్పట్లాగే వీర విధ్వంసం సృష్టిస్తాడు. ఇదేంటి.. ఒక్క సినిమాలో హీరోయిన్ మీద ఇన్ని ఎటాక్స్.. హీరో ఆమెను రక్షిస్తూ ఇన్ని ఫైట్లా అంటే.. మాస్ సినిమా అంటే అంతే అని సర్దుకుపోవాలి. దర్శనమిచ్చిన సీతారాముడు సింగం సిరీస్ తో మాస్ సినిమాలకు కొత్త నిర్వచనం చెప్పిన దర్శకుడు హరి. మాస్ సినిమాలంటే హీరోయిజం ఎలివేట్ చేయడం.. యాక్షన్ మోత మోగించడమే కాదు.. కథల్లో కూడా విషయం ఉంటుందని రుజువు చేస్తూ పవర్ ఫుల్ సినిమాలు అందించిన



హరి.. కొన్నేళ్ల నుంచి రొడ్డ కొట్టుడు సినిమాలతో లాగించేస్తున్నాడు. ఇప్పుడు ఆయన్నుంచి వచ్చిన పరమ రొటీన్ మాస్ సినిమా.. రత్నం. ఒక ల్యాండ్ సెటిల్మెంట్ చుట్టూరా రెండున్నర గంటల పాటు తిప్పి తిప్పి అవే సీన్లు చూపిస్తూ మాస్ సినిమాలంటే పడిచచ్చే ప్రేక్షకులతో కూడా దండం పెట్టించేస్తాడు హరి. ఇంత సిల్లీ కథతో ఒక స్టార్ హీరో.. పెద్ద కాస్టింగ్ పెట్టుకుని పెద్ద బడ్జెట్లో సినిమా తీయడం హరికే చెల్లింది. మొదట్లో పాత్రల పరిచయం వరకు పర్వాలేదనిపించే సినిమా.. ఆ తర్వాత హీరోయిన్ మీద తొలి ఎటాక్ జరిగిన దగ్గర్నుంచి ప్రేక్షకుల సహనాన్ని పరీక్షిస్తుంది. రౌడీలు ఎటాక్ చేయడం.. హీరో కాపాడ్డం.. సినిమా అంతా ఇదే వరస. ఫైటు ఫైటుకీ హీరో చేతిలో ఆయుధాలు మారుతుంటాయి కానీ.. అతను సృష్టించే విధ్వంసం మాత్రం కామన్. యాక్షన్ కొరియోగ్రాఫర్లు తమ క్రియేటివిటీ అంతా చూపిస్తూ హీరోతో రకరకాల విన్యాసాలు చేయించారు కానీ.. ప్రేక్షకులకు మాత్రం పోను పోను ఆ సీక్వెన్సులు చిత్ర హింసలా తయారవుతాయి. ఒళ్లీబనీ ఖీవజీట – లోకేష్- శ్రుతి రొమాంటిక్ కాంబో.. కమల్ రియాక్షన్ చూశారా? ఈ రొటీన్ ఫైట్లే భరించలేని విధంగా ఉంటే.. ఓవైపు హీరోయిన్ హీరోతో ప్రేమలో పడిపోయి ఊహల్లో తేలియాడుతుంటే.. అతనేమో ఆమెలో తల్లి పోలికలు చూసుకుని ఆమెను అమ్మలా ఆరాధించడం.. దీని మీద ఎమోషన్ రన్ చేయడం ఇంకా పెద్ద హింస. హీరో హీరోయిన్ల మధ్య ఇలాంటి ట్రాక్ పెట్టాలని హరికి ఎలా అనిపించిందో? సంబంధిత సన్నివేశాలకు ఎలా రియాక్టవ్వాలో కూడా ప్రేక్షకులకు అర్థం కాని పరిస్థితి. ఇక కనిపించిన ప్రతిసారీ ఒళ్లంతా పౌడర్ రాసుకుంటూ కనిపించే విలన్ పాత్రలో మురళీ శర్మది ఇంకో రకమైన టార్చర్. ఇలా సినిమా నిండా చిత్ర విచిత్రమైన క్యారెక్టర్లు.. భరించలేని సన్నివేశాలతో 'రత్నం' ప్రేక్షకులకు చుక్కలు చూపించేస్తుంది. మాస్ పేరుతో ఏం రాసినా.. ఏం తీసినా చెల్లిపోతుందనే భ్రమలో హరి అండ్ కో ఒక అర్థరహితమైన సినిమాను ప్రేక్షకులకు వడ్డించింది. మాస్ సినిమాలంటే వెర్రెత్తిపోయే ప్రేక్షకులు కూడా 'రత్నం'ను భరించడం చాలా చాలా కష్టం. నటీనటులు: విశాల్ తన సినిమాల్లో ఎప్పుడూ చేసేదే చేశాడు. సినిమా నిండా ఫైట్లే ఫైట్లు. మారుతున్న ప్రేక్షకుల అభిరుచిని అర్థం చేసుకోకుండా ఇంకా ఎన్ని రోజులు ఇవే ఫైట్లు చేసుకుంటూ విశాల్ ఇంకా ఇలా ఎన్ని రొటీన్ సినిమాలు వదులుతాడో అర్థం కాదు. నటన పరంగా ప్రత్యేకంగా చెప్పుకోవడానికి ఏమీ లేదు. హీరోయిన్ ప్రియా భవాని శంకర్ మాత్రం బాగా నటించింది. కానీ ఆమెను హీరోయిన్ లా కాకుండా మరీ మామూలు అమ్మాయిలా చూపించడం తనను ఇష్టపడే వారికి రుచించకపోవచ్చు. పాత్రకు తగ్గట్లు కొలిచినట్లు నటించే మురళీ శర్మ ఈ చిత్రంలో విపరీతమైన ఓవరాక్షన్ చేశాడు. అదంతా దర్శకుడి అభిరుచి మేరకే కావచ్చు. తులసి.. విజయ్ కుమార్ లాంటి నటులు చేసిన అతిని కూడా భరించలేం. యోగిబాబు.. మొట్ట రాజేంద్రన్ బేసిగ్గా కమెడియన్లు కాబట్టి వాళ్లు చేసింది కామెడీ అనుకుని నవ్వుకోవాలి. అంతే తప్ప చక్కిలిగింతలు పెట్టినా కూడా నవ్వు రాదు. సాంకేతిక వర్గం: దేవిశ్రీ ప్రసాద్ ఒకప్పుడు సినిమా ఎలా ఉన్నా తన వరకు పాటలతో అదరగొట్టేవాడు. కానీ కొన్నేళ్ల నుంచి పిండి కొద్దీ రొట్టె అన్నట్లు పని చేస్తున్నాడు. 'రత్నం' సినిమాలో పాటలు సినిమాకు తగ్గట్లే చాలా మొక్కుబడిగా సాగాయి. నేపథ్య సంగీతంలో కూడా విశేషమేమీ లేదు. సగటు మాస్ సినిమాలో వినిపించే సౌండ్లే ఇందులోనూ వింటాం. సుకుమారన్ ఛాయాగ్రహణం ఓకే. హరి సినిమాల్లో ఎప్పుడూ చూసే విజువల్సే కనిపిస్తాయి. నిర్మాణ విలువలకేమీ ఢోకా లేదు. బాగానే ఖర్చు పెట్టారు. కానీ దర్శకుడు హరినే కేవలం యాక్షన్ సీక్వెన్సులనే నమ్ముకుని సినిమాను లాగించేశాడు. కనీసం ఆ యాక్షన్ ఘట్టాలకు భిన్నమైన నేపథ్యాలు కూడా సెట్ చేయకుండా.. ఒకే టెంప్లేట్లో లాగించేశాడు. హరి కెరీర్లో అట్టడుగున నిలిచే సినిమాల్లో 'రత్నం' ఉంటుంది.

## ముఖంలో ముడుతలను మాయం చేయడానికి ఆముదం ఎలా ఉపయోగించాలి?

వృద్ధాప్యం అనేది అనివార్యం వయస్సైయ్యే కొద్ది వృద్ధాప్య లక్షణాలు పెరుగుతాయి. వృద్ధాప్యంతో చర్మంలో సన్నటి గీతలు మరియు ముడుతలను తెస్తుంది. ఈ చక్కటి గీతలు మరియు ముడతలు సమయానికి ముందు కనిపించడం ప్రారంభించినప్పుడు ఏమి జరుగుతుంది?మనలో ఆందోళ పెరుగుతుంది. ముఖ్యంగా ఇటువంటి చర్మ సమస్యలు చిన్న వయస్సులోనే కనబడితే, చర్మ సంరక్షణ కోసం ఇంటి నివారణలను ఉపయోగించడం ఎల్లప్పుడూ మీరు ఆశ్రయించవచ్చు ఎందుకంటే అవి మీ చర్మంపై పూర్తిగా సహజమైనవి మరియు సురక్షితమైనవి. అంతేకాకుండా, ఇంటి నివారణలు ఖర్చుతో కూడుకున్నవి కావు, అంటే చాలా చౌకైనవి. ఇంటి నివారణల గురించి తెలుసుకోవాలంటే, చర్మ సంరక్షణ కోసం, ముఖ్యంగా ముడతలు మరియు చక్కటి గీతలు వదిలించుకోవడానికి మీరు ఎప్పుడైనా ఆముదం ఉపయోగించటానికి ప్రయత్నించారా? 1. పచ్చి ఆముదం 1. పచ్చి ఆముదం ఆముదం తేమ, హైడ్రేటింగ్ మరియు చర్మం సాగే లక్షణాలు చర్మంలో ముడుతలు లేకుండా చేయడానికి ఉత్తమ ఎంపికలలో ఒకటిగా చేస్తాయి. కావల్సినవి 2 టేబుల్ స్పూన్లు ఆముదం ఎలా చెయ్యాలి మీ ముఖాన్ని గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోండి. పూర్తిగా పొడిగా ఉంచండి. ఒక గిన్నెలో కొంత ఆముదం జోడించండి. అందులో కాటన్ బంతిని ముంచి, ఎంచుకున్న ప్రదేశానికి వర్తించండి. ఎంచుకున్న ప్రదేశంలో కొన్ని నిమిషాలు మెత్తగా రుద్దండి, తరువాత దానిని కడగాలి. నిద్రపోయే ముందు రోజుకు ఒకసారి దీన్ని రిపీట్ చేయండి. సన్ టాన్ (చేతుల నలుపు) తొలగించే సాధారణ హోమ్ రెమెడీస్సన్ టాన్ (చేతుల నలుపు) తొలగించే సాధారణ హోమ్ రెమెడీస్ 2. ఆముదం ఒ కలబంద 2. ఆముదం ఒ కలబంద కలబంద మరియు ఆముదం సమానంగా తీసుకుని చర్మానికి వర్తించినప్పుడు, మీ చర్మంలో కొల్లాజెన్ ఉత్పత్తిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది మరియు దాని యాంటీగేజింగ్ లక్షణాలు మీ ముఖం ముడతలు మరియు ముఖంలో సన్నటి గీతలు లేకుండా ఉండేలా చేస్తుంది. కావలసినవి 1 టేబుల్ స్పూన్ ఆముదం 1 టేబుల్ స్పూన్ కలబంద జెల్ ఎలా చెయ్యాలి ఒక గిన్నెలో తాజాగా సేకరించిన అలోవెరా జెల్ మరియు ఆముదం నూనె కలపండి. బాగా కలుపు. ఎంచుకున్న ప్రదేశానికి వర్తించు మరియు సుమారు 10-15 నిమిషాలు ఉంచండి. దీన్ని కడిగి, మీ ముఖాన్ని పొడిగా ఉంచండి. రోజుకు ఒకసారి, రాత్రికి నిద్రపోయే ముందు వర్తించండి. మీ వద్ద ఈ 'ఒక పదార్థం' ఉంటే చాలు, చర్మ సమస్యలు వెంటనే తొలగిపోతాయని మీకు తెలుసా?మీ వద్ద ఈ 'ఒక పదార్థం' ఉంటే చాలు, చర్మ సమస్యలు వెంటనే తొలగిపోతాయని మీకు తెలుసా? 3. ఆముదం ఒ నిమ్మ 3. ఆముదం ఒ నిమ్మ నిమ్మకాయలో యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి, ఇవి రెగ్యులర్ వాడకంతో చర్మంలో సన్నటి గీతలు మరియు ముడతల రూపాన్ని చాలా వరకు తగ్గించడంలో సహాయపడతాయి. కావలసినవి 1 టేబుల్ స్పూన్ ఆముదం 1 స్పూన్ నిమ్మరసం ఎలా చెయ్యాలి ఒక గిన్నెలో రెండు పదార్థాలను కలపండి. ముడుతలున్న ప్రదేశంలో వర్తించండి. సుమారు అరగంట పాటు అలాగే ఉంచి తరువాత కడిగేయండి. ఈ మిశ్రమాన్ని మీ ముఖం మీద రోజుకు కనీసం 2-3 సార్లు రాయండి. పండుగ వేళ మీ చర్మ సౌందర్యం రెట్టింపు కావాలంటే... ఈ చిట్కాలను ఫాలో అవ్వండి... పండుగ వేళ మీ చర్మ సౌందర్యం రెట్టింపు కావాలంటే... ఈ చిట్కాలను ఫాలో అవ్వండి... 4. ఆముదం ఒ కొబ్బరి నూనె 4. ఆముదం ఒ కొబ్బరి నూనె కొబ్బరి నూనె లోతుగా చొచ్చుకుపోయే లక్షణాలను కలిగి ఉంటుంది, ఇది మీ చర్మం లోపల లోతుగా ఉండి మరమ్మత్తు చేయడానికి వీలు కల్పిస్తుంది, తద్వారా సన్నటి గీతలు మరియు ముడతలు తగ్గుతాయి. ఇది మీ చర్మాన్ని పోషిస్తుంది మరియు హైడ్రేట్ చేస్తుంది మరియు దాని ప్రకాశాన్ని నిలుపుకుంటుంది. కావలసినవి 2 టేబుల్ స్పూన్లు ఆముదం 2 టేబుల్ స్పూన్లు కొబ్బరి నూనె ఎలా చెయ్యాలి ఈ రెండు నూనెలను ఒక గిన్నెలో కలపండి మరియు అవి ఒకదానితో ఒకటి కలిసే వరకు బాగా కలపండి. మిశ్రమంలో ఒక పత్తి బంతిని ముంచి, ఎంచుకున్న ప్రదేశంలో కొన్ని నిమిషాలు మెత్తగా రుద్దండి. సుమారు 30 నిముషాల పాటు అలాగే ఉంచాలి. మెరుగైన ఫలితాల కోసం వారానికి 4 సార్లు దీన్ని పునరావృతం చేయండి. 5. ఆముదం ఒ బాదం ఆయిల్ 5. ఆముదం ఒ బాదం ఆయిల్ బాదం నూనెలో మీ రంగు మరియు చర్మం టోన్ మెరుగుపరచడానికి సహాయపడే ఎమోలియంట్ లక్షణాలను కలిగి ఉంటుంది, తద్వారా ముడతలు మరియు సన్నటి గీతలు తొలగిపోతాయి. ఆముదం మరియు బాదం నూనె రెండింటినీ ఒక గిన్నెలో సమాన పరిమాణంలో కలపండి. మిశ్రమంలో ఒక పత్తి బంతిని ముంచి, ఎంచుకున్న ప్రదేశంలో కొన్ని నిమిషాలు రుద్దండి. రాత్రిపూట వదిలి, ఉదయం కడగాలి. ప్రతిరోజూ నిద్రపోయే ముందు రాత్రి ఒకసారి దీన్ని పునరావృతం చేయండి.

## రోహిత్, స్కై కాదు!.. వరల్డ్‌కప్‌లో ఒకే ఓవర్లో 6 సిక్సులు కొట్టేది ఇతడే: యువీ

2007.. అంతర్జాతీయ క్రికెట్ మండలి మొట్టమొదటి సారి నిర్వహించిన టీ20 వరల్డ్‌కప్ టోర్నీలో నాటి టీమిండియా స్టార్ యువరాజ్ సింగ్ సృష్టించిన పరుగుల విధ్వంసాన్ని అభిమానులు అంత తేలికగా మర్చిపోలేరు.ఒకే ఓవర్లో ఏకంగా ఆరు సిక్సర్లు బాది యువీ అభిమానులకు కన్నుల పండుగ చేశాడు. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో స్టువర్ట్ బ్రాడ్ బౌలింగ్‌లో ఆరు బంతుల్లో ఆరు సిక్సులు కొట్టి ఏకంగా 36 పరుగులు పిండుకుని.. ప్రపంచంలో ఈ ఘనత సాధించిన తొలి క్రికెటర్‌గా చరిత్రకెక్కాడు.'న భూతో న భవిష్యతి' అన్న రీతిలో తాను సాధించిన ఘనత గురించి ఎదురైన ప్రశ్నకు యువరాజ్ సింగ్ ఆసక్తికర సమాధానం ఇచ్చాడు. టీ20 ప్రపంచకప్-2024లో టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన ఫీట్‌ను పునరావృతం చేయగలడని భావిస్తున్నట్లు తెలిపాడు.జూన్ 1 నుంచి అమెరికా- వెస్టిండీస్ వేదికగా వరల్డ్‌కప్ ఈవెంట్ ఆరంభం కానున్న విషయం తెలిసిందే. ఈ ఐసీసీ టోర్నీ కోసం మే 1 లోపు జట్లను ప్రకటించేందుకు ఇరవై దేశాల బోర్డులు సిద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో టీమిండియా ఎంపిక గురించి ఇప్పటికే చాలా మంది మాజీ క్రికెటర్లు తమ అభిప్రాయాలు పంచుకున్నారు.అతడికి కూడా ఛాన్స్ ఇవ్వాలిఐపీఎల్-2024లో పేలవ ప్రదర్శన కనబరుస్తున్న పేస్ ఆల్‌రౌండర్, ముంబై ఇండియన్స్ సారథి హార్దిక్ పాండ్యాకు ఈ జట్టులో చోటు దక్కడం కష్టమేనని భావిస్తున్నారు. అతడికి బదులు చెన్నై సూపర్ కింగ్స్ ఆల్‌రౌండర్ శివం దూబేకు ఛాన్స్ ఇవ్వాలని బీసీసీఐకి విజ్ఞప్తి చేస్తున్నారు.ఈ నేపథ్యంలో ఐసీసీతో మాట్లాడిన సందర్భంగా.. "ఈసారి వరల్డ్‌కప్‌లో ఒకే ఓవర్లో ఆరు సిక్సులు కొట్టగల సత్తా ఎవరికి ఉంది?" అని యువరాజ్ సింగ్‌కు ప్రశ్న ఎదురైంది. ఇందుకు బదులిస్తూ.. "నేనైతే హార్దిక్ పాండ్యానే సాధిస్తాడనుకుంటున్నా" అని యువీ పేర్కొన్నాడు.అదే సమయంలో ప్రపంచకప్ జట్టులో శివం దూబేకు కూడా చోటు ఇవ్వాలని యువీ అభిప్రాయపడ్డాడు. "టీమిండియాలో అతడికి సుస్థిర స్థానం ఉండటం లేదు. కానీ ఐపీఎల్‌లో మాత్రం బ్యాటింగ్‌తో అదరగొడుతున్నాడు.కాబట్టి అతడిని జట్టులోకి తీసుకుంటే ఉపయోగకరంగా ఉంటుంది" అని యువరాజ్ సింగ్ పేర్కొన్నాడు. కాగా వరల్డ్‌కప్-2024లో జూన్ 5న టీమిండియా ఐర్లాండ్‌తో తమ తొలి మ్యాచ్ ఆడనుంది. జూన్ 9న చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో అమీతుమీ తేల్చుకోనుంది.ఇక తొట్టతొలి పొట్టి ప్రపంచకప్-2007ను ధోని సేన గెలుచుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత ఇంత వరకు మళ్లీ టీ20 ఫార్మాట్లో టీమిండియా టైటిల్ గెలవలేదు.



## విగ్రాం శ్రీనివాస్ గౌడ్ కు గౌరవ డాక్టరేట్ ప్రధానం....




**ఆందోల్ (శ్రీ ప్రస్థానం న్యూస్):-**పెద్ద శంకరం పేట, ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ గ్లోబల్ అక్రిడిటేషన్ కౌన్సిల్ జర్మనీ వారు ఊటీలో నిర్వహించిన కార్యక్రమంలో విగ్రాం రామా గౌడ్ పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ మాజీ ఎంపీపీ, విగ్రాం శ్రీనివాస్ గౌడ్ కు ట్రస్టు ద్వారా ప్రజలకు అందించిన సామాజిక సేవలకు గుర్తింపుగా ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ కౌన్సిల్ జర్మన్ ద్వారా గౌరవ డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్ ను విగ్రాం శ్రీనివాస్ గౌడ్ కు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ డాక్టరేట్ ను ప్రధాన చేయడం సంతోషంగా ఉందని కీర్తిశేషులు విగ్రాం రామా గౌడ్ ప్రజలకు చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకొని మరిన్ని కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు విగ్రామ్ అనీష్ గౌడ్, చేనేత సహకార సంఘం మాజీ చైర్మన్ మహంకాళి కృష్ణమూర్తి, లోకేష్, సిద్దు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అందోల్ నియోజకవర్గం లో బిబి పాటిల్ ప్రచారంకు జననీరాజనం......



**అందోల్ (శ్రీ ప్రస్థానం న్యూస్):-** అందోల్ నియోజకవర్గం లో బిజెపి ఎంపీ అభ్యర్థి బిబి పాటిల్ ఎన్నికల ప్రచారం చేపట్టారు. అంతకుముందు బిబి పాటిల్ అల్లాదుర్గ్ లో ఈ నెల 30 న ప్రధాని మోదీ పాల్గొనే విశాల్ జన సభ వేదిక, పార్కింగ్, సభ ప్రాంగణం ను పరిశీలన చేశారు. చౌటకూర్ మండలం వెండికోల్ గ్రామం, జోగిపేట పట్టణం , టేక్మాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు.జోగిపేట్ లో శ్రీ మహాత్మా బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిబి పాటిల్ మాట్లాడుతూ?దేశంలో ప్రజలు బిజెపి కి బ్రహ్మరథం పడుతున్నారు అని పేర్కొన్నారు. ప్రపంచంలో దేశాన్ని విశ్వగురువుగా నిలిపిన మోడీకి ప్రజలు మరోసారి పట్టంకడుతారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిందని ఎద్దేవా చేశారు. భవిష్యత్ బాజాపా దే నని బిబి పాటిల్ ధీమా వ్యక్తం చేశారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ను ఈ పదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశానని, ప్రజలు తనను ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

### మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా టేక్మాల్ మేజర్ గ్రామపంచాయతీ మాజీ ఉపసర్పంచ్ షాజహాన్ పటేల్ నామినేషన్

**టెక్మాల్ (శ్రీ ప్రస్థానం న్యూస్):-**మెదక్ జిల్లా టేక్మాల్ మండల మేజర్ గ్రామపంచాయతీ మాజీ ఉపసర్పంచ్ షాజహాన్ పటేల్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా మెదక్ పార్లమెంట్లో గెలుపొందుతున్న అభ్యర్థులు వారి ఆస్తులను కాపాడుకోవడానికి తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదు అని అన్నారు నన్ను మెదక్ పట్టణ ప్రజలు స్వతంత్ర అభ్యర్థిగా గెలిపిస్తే ఢిల్లీలో ప్రజల కోసం రైతుల కోసం పోరాడుతానని అన్నారు మెదక్ జిల్లాలో మైనార్టీ ఓట్లు బలంగా ఉండడంతో బిజెపి బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీల నుండి ఓట్లు శీలిక కావచ్చునని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు ఇలాంటి వ్యక్తి మెదక్ పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసినందుకు మెదక్ జిల్లా ప్రజలు వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు అని మాజీ ఉప సర్పంచ్ షాజహాన్ పటేల్ తెలిపారు ఆయన పుట్టి పెరిగిన గ్రామం మంతూర్ మండల్ పుల్కల్ అయినప్పటికీ కొన్ని సంవత్సరాల క్రితం వారి మేనమామ ఉన్నటువంటి సాలోజిపల్లి గ్రామానికి వచ్చి అక్కడే ఉంటూ రాజకీయంగా ఎదిగినప్పటికీ సాలోజిపల్లి గ్రామం టేక్మాల్ గ్రామపంచాయతీలో ఉన్నప్పుడు టేక్మాల్ గ్రామ పంచాయతీకి ఉప సర్పంచ్ గా గెలుపొంది ఎన్నో సేవలు అందించినటువంటి షాజహాన్ పటేల్ గారికి ఇప్పటికీ టేక్మాల్ మేజర్ గ్రామపంచాయతీ ప్రజలు అండగా ఉంటున్నారు అంటే వారి చేసినటువంటి మంచి కార్యక్రమాలు కావచ్చు ఇలాంటి వ్యక్తి ఈ రోజున మెదక్ పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయడం అంటే టేక్మాల్ మండలానికి మంచి పేరు వస్తుందని టేక్మాల్ మండల ప్రజలు అంటున్నారు ఇలాంటి వ్యక్తి సాలోజిపల్లి గ్రామంలో ఉ న్నాడు అంటే నమ్మలేకపోతున్నామని ప్రజలు వాపోతున్నారు







# ప్రచారంలో కారు జోరు..

### గెలుపు లక్ష్యంగా అప్రమత్తం అయిన నేతలు
### రైతులే ఎజెండగా ప్రణాళికా బద్ధంగా ప్రచారం

నిజామాబాద్,ఏప్రిల్27: లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీఆర్ఎస్ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నది. అసెంబ్లీలో ఓటమితో ఇప్పుడు పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చాటాలని చూస్తోంది. నిజామాబాద్, జహీరాబాద్ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ప్రచార పర్వంలో దూసుకెళ్తున్నది. పార్టీ అభ్యర్థులు బాజిరెడ్డి గోవర్ధన్, గాలి అనిల్ కుమార్ క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. కార్యకర్తలతో పాటు ప్రజలను కలుస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. నిజామాబాద్‌లో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బిగాల గణెళిశ్‌గుప్తా, పార్టీ ముఖ్య నేతలు ప్రచార బాధ్యతలు చేపట్టారు. అటు జహీరాబాద్ లోక్‌సభ పరిధిలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, జాజాల సురేందర్, గంప గోవర్ధన్ తదితరులు పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ పకడ్బందీగా ప్రచారం చేస్తున్నారు. మరోవైపు, ప్రత్యర్థి పార్టీల ప్రచారానికి దీటుగా ప్రచారం చేస్తున్నా బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌పై విమర్శలు ఐదు రోజుల్లో పసుపుబోర్డు తెస్తానని బాండు రాసిచ్చి ఐదేండ్ల పాటు మోసం చేశారన్న ఆగ్రహం రైతుల్లో వ్యక్తమవుతున్నది. ఇక జగిత్యాల జిల్లాకు చెందిన కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి నిజామాబాద్ జిల్లా నాయకుల నుంచి పూర్తి స్థాయి సహకారం అందడం లేదని పార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి. అందుకే ప్రచారం ముమ్మరం చేయలేక పోతున్నారనే వాదన వినిపిస్తున్నది.బిఆర్ఎస్ అధికారంలో ఉండగా కేసీఆర్ నిర్మించిన ప్రాజెక్టులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రైతు ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా తెలంగాణ అవతరించిందని ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. అయితే రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. తెలంగాణ దేశానికి అన్నం పెట్టే అన్నపూర్ణగా మారిందని అన్నారు. ఇది గమనించి తమ పీఠాలకు ఎసరు వస్తుందనే కాంగ్రెస్, బిజెపిల నేతలు ఇష్టం వచ్చినట్లుగా హామీలు ఇచ్చి మాట్లాడుతున్నారని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు వీరికి గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. రానున్న రోజుల్లో బిఆర్ఎస్ పూర్తి ఆధిపత్యంలోకి వస్తుందని అన్నారు. తెలంగాణలో పదేళ్ల నాటికి, నేడు ఉన్న పరిస్థితులను ప్రజలు గమనించాలన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న

కేసీఆర్ వెంట ప్రజలు నిలువాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలు కళ్లముందు కనిపిస్తున్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే అంధకారం అవుతుందని నాటి పాలకులు చెప్పారని గుర్తు చేశారు. వ్యవసాయానికి ఉచితంగా 24గంటలపాటు విద్యుత్ ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కేసీఆర్ కాళేశ్వరం నిర్మించి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందిస్తే ఇప్పుడు దానిని పడావు పెట్టారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అరచేతిలో వైకుంఠం చూపుతోందన్నారు. గతంలో కాంగ్రెస్ చేయలేని అభివృద్ధి ఇప్పుడు ఎట్ల చేస్తదో ప్రజలు ప్రశ్నించాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్న బీఆర్ఎస్ కు అండగా ఉండాలన్నారు.

# రిజర్వేషన్ల చుట్టూ రాజకీయాలు

హైదరాబాద్, ఏప్రిల్ 27 (న్యూస్ పల్స్) తెలంగాణలో రిజర్వేషన్ రాజకీయాలు ఊపందుకుంటున్నాయి. జాతీయ పార్టీలు అయిన కాంగ్రెస్, బీజేపీ ఎన్నికల ప్రచార అంశాలుగా రిజర్వేషన్ల అంశాన్ని తీసుకుంటున్నాయి. బీజేపీ అగ్రనేత అమిత్ షా తెలంగాణలో బహిరంగసభలో ప్రసంగించి ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రకటించారు. వాటిని ఎస్సీ, ఎస్టీలకు ఇస్తామన్నారు. అదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి మరో చోట ఇదే రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావించారు.కేంద్రంలో మరోసారి బీజేపీ వస్తే రిజర్వేషన్లను పూర్తిగా ఎత్తివేస్తుందని హెచ్చరించారు. ఆ పార్టీ ఆ దిశగానే ప్రయత్నిస్తోందని మరోసారి అధికారంలోకి వస్తే అదే చేస్తుందని అంటున్నారు. ఇలా జాతీయ పార్టీలు రెండు రిజర్వేషన్ల చుట్టూ ఓటింగ్ ప్రయారిటీ సెట్ చేసే ప్రయత్నం చేయడం రాజకీయవర్గాల్లో ఆసక్తికరంగా మారింది. తెలంగాణలో బీజేపీ బలం పెంచుకోవడానికి? మొదటి నుంచి ఓ అస్త్రం ప్రయోగిస్తోంది. అదే ముస్లిం రిజర్వేషన్ల రద్దు. అమిత్ షా ఎప్పుడు తెలంగాణ పర్యటనకు వచ్చినా.. ఎన్నికల ప్రచార సభల్లో మాట్లాడినా ముస్లిం రిజర్వేషన్ల గురించి ఖచ్చితంగా ప్రస్తావిస్తారు. ముస్లింలకు ఇప్పుడు నాలుగు శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. చెప్పడానికి ముస్లిం రిజర్వేషన్లు అంటున్నారు కానీ.. అవి ముస్లింలలో ఆర్థికంగా బాగా వెనుకబడిన 14 ఉపకులాలకు చెందినవారికి ఉన్నాయి. వైఎస్ హయాంలో ముస్లింలను ఆకట్టుకోవడానికి వీటిని ఇచ్చి కులాల జాబితాలో ఆయా వర్గాలను చేర్చారు. మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగం ప్రకారం చెల్లవు. అందుకే ఈ రిజర్వేషన్లు ఎప్పటికప్పుడు వివాదం అవుతూనే ఉన్నాయి. వీరికి ఉన్న రిజర్వేషన్లను పన్నెండు శాతానికి పెంచుతామని ఉద్యమ సమయంలో కేసీఆర్ హామీ ఇచ్చారు. తర్వాత అసెంబ్లీలో తీర్మానం చేశారు ఆ తీర్మానం తర్వాత కేసీఆర్ కూడా పట్టించుకోలేదు. మునుగోడు ఉపఎన్నికలకుముందు ఎస్సీ రిజర్వేషన్లపై అధికారం లేకపోయినా జీవవో ఇచ్చారు కానీ.. ముస్లిం రిజర్వేషన్లకు ఇవ్వలేదు. గత అసెంబ్లీ ఎన్నికలకు మందు కర్ణాటకలో ఇలా ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తూ అప్పటి బీజేపీ ప్రభుత్వం జీవో ఇచ్చింది. కానీ సుప్రీంకోర్టులో ఆగిపోయింది. కర్ణాటకలో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు ఉ న్నాయి.వాటిని రద్దుచేసి నాలుగు శాతాన్ని లింగాయత్, ఒక్కలిగలకు చెరో రెండు శాతాన్ని పంచుతున్నట్లు ప్రభుత్వం జీవో ఇచ్చింది. మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడం రాజ్యాంగ వ్యతిరేకమని, అందుకే ఈ రిజర్వేషన్లను రద్దు చేస్తున్నామని అప్పటి బీజేపీ ప్రభుత్వం వెల్లడించింది. నిజానికి కర్ణాటకలోనూ మతం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించలేదు. 1994లో మండల్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా ముస్లింలలోని కొన్ని కులాలను ఇతర వెనుకబడిన కులాలను ఓబీసీల్లో సబ్ కేటగిరీగా చేర్చారు. ఆ కేటగరిలోనే రిజర్వేషన్లు ఇస్తున్నారు. అంటే తెలంగాణ తరహాలోనే అక్కడ కూడా కులం ఆధారంగానే ముస్లింలకు రిజర్వేషన్లు అమలవుతున్నాయి. అందుకే ఈ అంశం సుప్రీంకోర్టులో ఆగిపోయింది. కర్ణాటకలో లాగే తెలంగాణలోనూ ముస్లిం రిజర్వేషన్లు తీసేసి ఎస్సీ, ఎస్టీలకు ఇస్తామంటున్నారు. అయితే తెలంగాణలో ముస్లింలకు కులం ఆధారంగా రిజర్వేషన్లు ఇస్తున్నారు. కానీ, మతం ఆధారంగా ఈ రిజర్వేషన్లు వర్తింప చేస్తున్నారని అమిత్ షా అంటున్నారు. ముస్లింలు భారతీయ జనతా పార్టీకి ఓటు బ్యాంక్ కాదు.

బీజేపీ ప్రత్యేకమైన వ్యూహంతో ఉంటుంది. ఇప్పుడు వారి రిజర్వేషన్లు తీసేసి ఎస్సీ, ఎస్టీలకు పెంచుతామని హామీ ఇస్తున్నారు. కుల పరమైన రిజర్వేషన్లే చట్ట పరంగా అమలవుతున్నాయి కాబట్టి ముస్లింలకు ప్రత్యేకంగా రద్దు చేయలేరు.. ప్రత్యేకంగా కమిషన్ వేసి.. వారు అంటే ముస్లింలలో కొన్ని కులాల వారు అర్హులు కాదని తేల్చితే అప్పుడు తీసేయగలరు. అది అంత తేలిక కాదు. అందుకే ఇది రాజకీయ నినాదంగానే ఎక్కువ మంది భావిస్తున్నారు. సిద్దిపేట సభలో అమిత్ షా ముస్లిం రిజర్వేషన్ల రద్దు ప్రకటన చేసిన కాసేపటికే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ లో బీజేపీపై చార్జిషీట్ వేసే కార్యక్రమంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను రద్దు చేయాలని బీజేపీ కుట్ర చేస్తోందని, ఇదే మోదీ ఆఖరు అస్త్రమని స్పష్టం చేశారు. ఆర్ఎస్ఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని ఆ ఎజెండాను అమలు చేసేందుకు రాజ్యాంగ సవరణ జరగాలని ఇందుకోసం మోదీకి మూడింట రెండు వంతుల మెజార్టీ కావాలన్నారు. అందుకే బీజేపీ నాలుగు వందల సీట్ల టార్గెట్ గా పెట్టుకుందన్నారు. బీజేపీ రాజ్యాంగాన్ని రద్దు చేస్తుందని.. రిజర్వేషన్లను కూడా వదిలి పెట్టదని కాంగ్రెస్ చాలా కాలంగా ప్రచారం చేస్తోంది. ఇప్పుడు అమిత్ షా ముస్లిం రిజర్వేషన్ల గురించి మాట్లాడటంతో.. కాంగ్రెస్ మరింత అందిపుచ్చుకుని ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమయింది. ఈ రిజర్వేషన్ల రద్దు పేరుతో ఓటర్లను భయపెట్టి ఎవరు ఎక్కువగా లబ్ది పొందుతారో చూడాల్సి ఉంది.

# 9 ముఖ్య హామీలతో వైసిపి మేనిఫెస్టో-2024 విడుదల!



తాడేపల్లి: ఆంధ్రప్రదేశ్ లో వైసిపి రెండు పేజీల మేనిఫెస్టోను ముఖ్యమంత్రి వైఎస్. జగన్ విడుదల చేశారు. అందులో ఇళ్ల స్థలాలు లేని అర్హులైన వారందరికీ ఇళ్లు, వైఎస్సార్ చేయూత నాలుగు విడతల్లో రూ. 75 వేల నుంచి రూ. లక్షా 50 వేలకు పెంపు, రైతు భరోసా రూ. 13500 నుంచి 16000కు పెంచుతామన్నారు. వైఎస్సార్ ఈబిసి నేస్తం నాలుగు దఫాల్లో 45 వేల నుంచి లక్షా 5 వేలకు పెంచుతామన్నారు.ఆటో, ట్యాక్సీ, లారీలు కొనుగోలు చేసేవారికి వడ్డీ రాయితీ, రెండు విడతల్లో పింఛను రూ. 3000 నుంచి రూ. 3500కు పెంచడం, 2028లో జనవరిలో మరో రూ. 250 పింఛను పెంచడం,లారీ , ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ. 10 లక్షల వరకు ప్రమాద బీమా, కౌలు రైతులకు కూడా రైతు భరోసా, యూనివర్సిటీల్లో బ్యాక్ లాగ్ లో ఉన్న 3590 పోస్టుల భర్తీ, మత్స్యకారుల భరోసాను ఐదేళ్లలో రూ. 50 వేల నుంచి రూ. లక్షకు పెంచుతామన్నారు. ప్రతి జిల్లాలో నైపుణ్యం కోసం స్కిల్ డెవలప్మెంట్ హబ్,అమ్మ ఒడి రూ. 15 వేల నుంచి రూ. 17 వేలకు పెంచనున్నారు, వాహన మిత్రను ఐదేళ్లలో 50 వేల నుంచి లక్షకు పెంచుతారు, ఐదేళ్లలో ఓబిసి నేస్తం అమలుచేస్తామన్నారు.'చేయగలిగినవి మాత్రమే చెబుతున్నాం' అన్న ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి మేనిఫోస్టో ప్రతి ప్రభుత్వ అధికారి వద్ద ఉందన్నారు. మేనిఫెస్టో అంటే పవిత్ర గ్రంథం అని అభిప్రాయపడ్డారు. 2019లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశామన్నారు. తమ మేనిఫెస్టో అమలు చేసిన తీరు చరిత్రలో నిలిచపోతుందన్నారు. రూ. 2 లక్షల 70 వేల కోట్లను డిబిటి చేశామని తెలిపారు. నేరుగా ప్రజల ఖాతాల్లో డబ్బు వేశామన్నారు. తాడేపల్లి క్యాంప్ ఆఫీస్ లో ఏపి సిఎం జగన్ 2024 మేనిఫెస్టో విడుదల చేశారు. రెండు పేజీల మేనఫెస్టోలో 9 హామీలు ఇచ్చారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉన్నత విద్య, అభివృద్ధి, పేదలకు ఇల్లు, నాడు నేడు, మహిళా సాధికారత, సామాజిక భద్రత(సోషల్ సెక్యూరిటీ) అనేవి ఇందులో ఉన్నాయి.

# తెలంగాణలో వేడి పరిస్థితులు..! ఎల్లో అలెర్ట్ జారీ చేసిన

తెలంగాణ రాగల ఐదురోజుల్లో వడగాలులు వీస్తాయని.. మరికొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. శనివారం తేమతో కూడిన పరిస్థితులు ఏర్పడుతాయని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఏర్పడుతాయని చెప్పింది.ఆదివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో తేమ పరిస్థితులు ఉంటాయని పేర్కొంది. అలాగే ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది.



## మోసపూరిత కాంగ్రెస్‌ను గద్దె దించేవరకు పోరు

### ఆవిర్భావ సభలో ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి



నల్లగొండ,ఏప్రిల్27: బీఆర్ఎస్ పార్టీ మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టబోతున్నదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి అన్నారు. మోసపూరిత హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ప్రజల గోసకు కారణమైన ఈ ప్రభుత్వాన్ని గద్దె దించేవరకు ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందని చెప్పారు. చావునోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌కు పిల్ల మూకలు ఓ లెక్క కాదన్నారు. నల్లగొండలో పార్టీ నాయకులు కోటిరెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి, కంచర్ల భూపాల్ రెడ్డి, రవీంద్ర నాయక్‌తో కాలిసి బీఆర్‌పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ కోసం అలుపెరగని పోరాటం చేసి రాష్టాన్ని సాధించామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆకలి చావులు, ఆత్మహత్యలు పెరిగాయని చెప్పారు. ప్రజలు పాధి కోసం మళ్లీ విదేశాల బాట పట్టాల్సి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందని తెలిపారు. కానీ కాంగ్రెస్ సర్కార్‌లో పచ్చని పంటలతో కలకలలాడే భూములు బీడుగా మారాయని విమర్శించారు. పదేండ్లు అద్భుతంగా నిర్మించిన తెలంగాణను మూడు నెలల్లోనే కుప్పకూల్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కోమటిరెడ్డి బ్రదర్స్ తమ జీవితంలో నిజాలు మాట్లాడలేదని ఫైర్ అయ్యారు.

## జ్ఞానంతోనే ప్రతిభ ఇనుమడిస్తుంది !(ఆధ్యాత్మికం )

తిరుమల,ఏప్రిల్27 : వీలైనంత వరకు జ్ఞానాన్ని సముపార్జించాలి. అది మనవరకే కాకుండా నలుగురితో పంచుకోవాలి. మన జ్ఞానం అందరికీ ఉపయోగ పడాలి. అప్పుడే మన ప్రతిభ ఇనుమడిస్తుంది. ఎందుకంటే మనం సాధించాలనుకొన్న కార్యంలో సన్నిహితులు మనకు సహాయం చేస్తారు. అప్పుడు మన సాధన సులువవుతుంది. నువ్వు ఈ కార్యం సాధించగలవు అంటూ హితులు, మిత్రులు, సహచరులు ధైర్యం చెబితేనే హనుమ సముద్రం దాటి లంకకు చేరి కార్యం సాధించుకొని వచ్చి 'చూశాను సీతను' అనగలిగాడు. మనం ఏదైనా గొప్ప కార్యాన్ని తలపెట్టి పూర్తి చేయాలనుకొంటే మనకో మంచి స్నేహితుడు ఉండాలి. అతడు విమర్శకుడు, మార్గదర్శకుడైతే ఎన్నో మంచి మాటలను ఉపదేశిస్తాడు. అప్పుడు మనం అనుకొన్న సాధన సఫలమై తీరుతుంది. మనందరిలో ప్రత్యేకత ఉంది. కానీ, దాన్ని కనిపెట్టే తీరిక ఓపిక ఉంటే ఏది సాధించడంలోనైనా మనలో ప్రాజ్ఞత వికసిస్తుంది. సూర్యవంశానికి చెందిన భగీరథుడు సగరుడి వారసులకు ఉత్తమ గతులను కలగజేసేందుకు దివిజ గంగను భువికి తెచ్చే మహా ప్రయత్నం చేశాడు. ఈ సాధననే భగీరథ సాధన అన్నారు. ప్రతి మనిషీ అద్భుతంగా జీవించాలని ఆదిశంకరాచార్యులు తరచూ అనేవారట. అలా బతికితే ప్రతి రోజూ సాధనకు మనసు ఉరకలు వేస్తుంది. రాబోయే రోజులన్నీ ఆశాజ్యోతులవుతాయి. ఆదిశంకరులు దేశాన్ని మొత్తం కాలినడకన పర్యటించి తాను తలపెట్టినట్లు నాలుగు పీఠాలను నెలకొల్పగలిగారు. పాశ్చాత్య పురాణాల్లోని నాయకులు కండబలం కలవారు. మన భారతీయ ఇతిహాసాల్లో ధీరులు నైతికంగా ధార్మికంగా బలవంతులు. కండబలం కంటే గుండెబలం మనోబలం శక్తిమంతమైనవి. ఇలాంటి సాధకులే రామాయణ మహాభారత వీర గాథలకు కారకులు.

## అదిలాబాద్ కాషాయంలో కషాయం...

అదిలాబాద్, ఏప్రిల్ 27 (న్యూస్ పల్స్)ఎన్నికలకు ఇంకా మూడు వారాలు కూడా లేని ఈ సమయంలో ఇక్కడి కాషాయ దళంలో అసమ్మతి మళ్లీ భగ్గుమంటోంది. బరిలో ఉన్న కాషాయ అభ్యర్థికి ఏసీలోను చెమటలు పట్టే పరిస్థితిని తెస్తుందంట. కారణం ఈ పార్లమెంట్ పరిధిలో గెలిచిన నలుగురు ఎమ్మెల్యేలు కలిసినట్టుగానే కలిసి నామినేషన్ ర్యాలీలో పాల్గొన్నారు. అయితే జిల్లాకు చెందిన ముఖ్య నేత మాత్రం కినుక వహించి తిరుగుతున్నారట. అభ్యర్థి ప్రకటన నుండి పార్టీకి దూరంగా ఉంటూ, నా దారి నాదే అన్నట్టుగా వ్యవహరిస్తున్న ఎంపీ సోయం బాపురావు వ్యవహార శైలి నేతల్లో గుబులు పుట్టిస్తోంది.నెల రోజులుగా మౌనం దాల్చిన సోయం బాపురావు నా రూటే సపరేట్ అంటూ తనదైన స్టైల్ లో అభ్యర్థికి షాక్ ల షాక్ ఇస్తున్నాడట. గెలిపే లక్ష్యంగా కాషాయ క్యాడర్ గడపగడపకు ప్రచారం చేస్తున్నా, బీజేపీకి ఆదివాసీ గూడాల నుండి ఆ స్థాయి మద్దతు రావడం లేదట. కారణం సోయం బాపురావు నిర్ణయమే అని టాక్ బలంగా రీసౌండ్ ఇస్తోందట. కారణం ఆయన బీజేపీ అభ్యర్థి గోడెం నగేష్ కు కాకుండా మరోసారి ఆదివాసీ నేతకు జైకొట్టడమే అని తెలుస్తోంది. ఎంపీగా మరోసారి సీట్ దక్కకపోవడంతో అలక బూనిన సోయం బాపురావు, నెల రోజులుగా పార్టీకి కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. తాజాగా బీజేపీ అభ్యర్థికి మద్దతు ఉపసంహరించుకోవడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. అక్కడితో ఆగకుండా ఆదివాసీ గూడాల్లో ఆదివాసీ పెద్దలతో రహస్యంగా సమావేశమై, తాను బీజేపీలోనే ఉన్నానని, కానీ ఆదివాసీల పక్షాన నిలిచే నేతకే ఈసారి పట్టం కట్టాలని, పార్టీలు ముఖ్యం కాదు నేతలే ముఖ్యం అంటూ తనదైన శైలిలో ఒంటరి ప్రచారం చేస్తున్నారట.అయితే ఆ ప్రచారం బీజేపీ అభ్యర్థికి మద్దతుగా చేస్తున్నది కాకపోవడంతో సోయం ఎవరి పక్షాన నిలిచి ఒంటరి ప్రచారం చేస్తున్నారనే చర్చ పార్లమెంట్ పరిధిలో జోరుగా సాగుతోంది. ఆదివాసీ ఉద్యమ నేతకే పట్టం కట్టాలని సోయం బాపురావు గూడాల్లో గడపగడపకు తన సమాచారం చేరవేస్తుండటంతో.. ఆ ఉద్యమ నేత ఎవరనే టాక్ ఇటు బీజేపీ పార్టీలో అటు రాజకీయవర్గాల్లో జోరుగా సాగుతోంది. అయితే ఆ ఆదివాసీ ఉద్యమ నేత తన చిరకాల మిత్రుడే అన్న టాక్ పార్టీలో రీ సౌండ్ ఇస్తుండటంతో సోయంను దారికి తెచ్చుకునేందుకు అధిష్టానం, పార్లమెంట్ ఇంఛార్జ్ విశ్వప్రయత్నాలే చేస్తున్నారట.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJETHA PRINTERS,H. NO: 46/801BHUDHAWARPETA, KURNOOL DIST,-518001, ANDHRA PRADESH, INDIA . PUBLISHED AT. H.NO 43/217A, NR PETA, KURNOOL DIST, ANDHRA PRADESH, INDIA. EDITOR PERUMALLA CHENNAKESHAVULU RNI NO: APTEL 2020/80757